వచ్చే కాలం

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

[గతసంచిక తరువాయి]

3

* * కుటుంబయ్యగారి యిల్లు - ముందు గది; సాయంకాలం. సోమనాథం కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ వుంటాడు. నోట్లో చుట్టవుంటుంది.

చంద్రశేఖరం: (బయటినుంచి) కుటుంబయ్యగారూ!

సోమనాథం: (లోనుండి) ఎవరూ?

చంద్ర : నేనూ, చంద్రశేఖరాన్ని.

సోమ : అక్కణ్నించే అరుస్తావేం? లోపలికి రారాదూ?

[శేఖరం లోపలికి వచ్చాడు; సోమనాథం, అతను రాగానే పేపరు బల్లమీద పడేసి, కళ్ళజోడు తీసి చేత్తో పట్టుకొన్నాడు.]

సోమ : ఏవిఁరో, ఈమధ్య కనిపించడం మానీసేవు.

చంద్ర : (కుర్చీలో కూర్చుంటూ) ఎందుకు మానీసేనూ!

సోమ : ఏమో. ఎందుకు మానీసేవో.

చంద్ర : మీరే కనిపించడం మానీసేరు.

సోమ : నేనా?

చంద్ర : ఇక్కడికి తరచొస్తూనే ఉన్నాను.

సోమ : ఒస్తున్నావా? నేనీమధ్య తిరుగుతున్నాను కదూ మరి.

చంద్ర : ఎందుకు?

సోమ : ఆవేళ మీవాడిదగ్గిరి కెందుకొచ్చేను? అందుకు.

చంద్ర : ఏమైఁనా కుదిరిందా?

సోమ : ఏదీ?

చంద్ర : ఇహ నేనూ చూస్తాలెండి; కాని కుటుంబయ్యగారేరీ?

సోమ : కాకినాడెళ్లేడు తెలీదూ?

చంద్ర : కాకినాడా? అవునవును. వెళ్తాఁనని చెప్పేరు. అయితే మళ్లీ ఎప్పుడొస్తారు?

సోమ : పెళ్లాన్నీ చిన్నదాన్నీ తీసుకొని సోంవారవొఁస్తాడు.

చంద్ర : ఇవాళ శుక్రవారం కదూ?

సోమ : అవును.

చంద్ర : (కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు.)

సోమ : మీ యజమానెలాఉన్నాడు? ఏమైఁనా తేరుకున్నాడా?

చంద్ర : (అటూ ఇటూ నడుస్తూ) బాగానేఉన్నాడు.

సోమ : ఏమోలే. ఆవేళే "హరీ" అనేస్తాడనుకున్నాను.

చంద్ర : (సిగరెట్టు అంటిస్తూ) అటువంటిభయం లేదు.

సోమ : కాని ముసలాడికి పాపం గొప్ప దెబ్బ తగిలింది.

చంద్ర : అవును.

సోమ : పెద్దకొడుకా? మరొహడా?

చంద్ర : అవును.

సోమ : ఆఖరిసారి చూడ్డానికైనా వీల్లేకపోయింది ముండావాడికి.

చంద్ర : అవును.

సోమ : సప్తసవుఁద్రాలూ దాటి చావడంకోసం కుర్రాడు ఎక్కడకెళ్లేడో చూడు.

చంద్ర : అవును.

సోమ : అంతేరా బాబూ! చావెప్పుడొస్తుందో చెప్పలేం.

చంద్ర : అవునవును.

సోమ : ఊరనో, అడవినో, ఉదకమధ్యమునకో? రెప్పుడో విడచుట? ఏక్షణంబో?

చంద్ర : సోవఁనాథంగారూ ఈ వేదాంతం కట్టిపెట్టండి.

సోమ : చావెప్పుడొస్తుందో చెప్పలేనంటున్నాను. అదీ వేదాంతమే నీకు?

చంద్ర : వేదాంతమవునో కాదో నాకు తెలీదు గాని, నేనిప్పుడు మీతో చావుగురించి మాట్లాడదల్చుకోలేదు.

సోమ : మానీ, చావుగురించి మాట్లాడకపోతే పెళ్లి గురించి మాట్లాడు. ఎవడొద్దన్నాడు?

చంద్ర : పెళ్లి గురించే మాట్లాడతాను.

సోమ : నీకు పెళ్లీ పెడాకులూ అక్కర్లేదు కదా! మరెవడి పెళ్లిగురించి మాట్లాడతావు?

చంద్ర : కామేశ్వరేది?

సోమ : అదెందుకూ?

చంద్ర : ఇంట్లో ఉందా?

సోమ : లేదు.

చంద్ర : ఎక్కడికెళ్లింది?

సోమ : ఇక్కడ ఒక్కర్తెవీ కూచుంటే ఏం తోస్తుందని మా ఇంటికి పమ్మించేను. మా ఇంట్లో పిల్లలు గోలగోల. అంచేత నేనిక్కడ బైతాయించేను.

చంద్ర : మంచి పన్చేసేరు.

సోమ : నీ మనసులో ఏదో ఉన్నట్టుంది?

చంద్ర : ఉంది.

సోమ : ఏమిటో చెప్పుమరి.

చంద్ర : మీరు... అల్లరేం చెయ్యరుకద?

సోమ : నే నల్లరిచేస్తానా? గుంటవెధవ ననుకున్నావా ఏమిటి?

చంద్ర : మీ సాయం కావాలిప్పుడు.

సోమ : కావలిస్తే తీసుకో.

చంద్ర : మీరు కోపం తెచ్చుకోకూడదు.

సోమ : కోపమెందుకూ?

చంద్ర : చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

సోమ : అలాగే వ్యవహరిద్దాం.

చంద్ర : ఎవ్వరితోనూ చెప్పకూడదు.

సోమ : అంత పరమరహస్యం నాతో చెప్పడమెందుకూ?

చంద్ర : మీతో చెప్పకతప్పదు. ఈ విషయంలో మీరే నాక్కావలసిన మనుషులు.

సోమ : అదేదో ముందుచెప్పి తగలడ్రాదూ?

చంద్ర : అల్లరిచెయ్యనని అసరా ఇవ్వండి ముందు.

సోమ : అల్లరిచెయ్యను. సరా? సంతోషమేనా?

చంద్ర : సంతోషమే

సోమ : మరి వేగిరం చెప్పు.

చంద్ర : ఇదో ఆడపిల్లకి సంబంధించిన విషయం.

సోమ : ఆడపిల్లా?

చంద్ర : ఆడపిల్లే! మనం సాయంచేసి ఆమెనో ఒడ్డుకు చేర్చాలి.

సోమ : ఎవరా ఆడపిల్ల?

చంద్ర : ఒడ్డుకి చేర్చడానికి సాయం చేస్తారా? చెయ్యరా?

సోమ : అలాగే చేరుద్దాం. ముందు సంగతేమిటో చెప్పు.

చంద్ర : ఏంలేదు. మన కామేశ్వరుందికదూ!

సోమ : అవును. కామేశ్వరి.

చంద్ర : రవణయ్య రెండోకొడుకున్నాడు తెలుసు కదూ?

సోమ : అవును. రెండోకొడుకు. వాడికీ దానికీ ఏమిటయిందిప్పుడు?

చంద్ర : వాడిప్పుడు కామేశ్వర్ని పెళ్లాణ్ణంటున్నాడు.

సోమ : ఏమిటేమిటి?!

చంద్ర : రవణయ్యగారి రెండోకొడుకు. పేరు మోహన్రావు. వాడిప్పుడు మన కామేశ్వర్ని పెళ్లాడ నంటున్నాడు.

సోమ : అదేమిట్రా? వెఱ్ఱెత్తిందా ఏమిట్నీకు? రవణయ్య కొడుకేమిటి? కామేశ్వరేమిటి? పెళ్లేమిటి?

చంద్ర : అలా గాభరాపడి కేకవెయ్యకండి.

సోమ : మర్నాకేం బోధపడకుండా ఉందిరా? వివరంగా చెప్పు.

చంద్ర : చెప్పేకదూ. పెళ్ళాడతానన్చెప్పి పిల్లని లొంగదీసుకున్నాడు. ఇప్పుడు ఫో ఫొమ్మంటున్నాడు.

సోమ : ఏమిటే, లొంగదీసేసుకున్నాడూ? (అంటూ కుర్చీలోంచి లేచిపోయాడు)

చంద్ర : లొంగదీసుకున్నాడు.

సోమ : అంత పనే ?!

చంద్ర : అంత పనే!

సోమ : ఇప్పుడు ఫో ఫొమ్మంటున్నాడా ?!

చంద్ర : ఆమాటే అంటున్నాడు.

సోమ : హమ్మ దొంగగాడిదకొడకా, హమ్మ దొంగ గాడిద కొడకా! ఎంతపన్చేసేవురా! ఎంత పన్చేసేవురా! (అంటూ అటూ ఇటూ పచారుచేసి ఆగి) అయితే ఇప్పుడేం చేదాం వంటావ్! వెళ్లి వాడి నడిరగ్గొడదావా?!

[ఇంతలో జగన్నాథం ప్రవేశించి]

జగ : "ఎవర్నడ్డి విరగ్గొట్టడం ?"

[జగన్నాథం ఇదివరకటిలాంటి బట్టలే వేసుకున్నాడు. ఇదివరకులాగే మెథాడికల్‌గా జోళ్లువిప్పుతున్నాడు. ఇదివరకులాగే సీరియస్‌గా వున్నాడు.]

సోమ : (శేఖరంతో) ఏవిఁట్రా వాడిపేరూ ?

చంద్ర : ఏంలేదు.

సోమ : ఆ వెధవ పేరేవిఁట్రా?

జగ : ఏ వెధవపేరు?

చంద్ర : ఏంలేదు. మీరలా కూర్చోండి సోవఁనాథంగారూ.

సోమ : నువ్వూ రారా అబ్బాయ్. ఒచ్చి విను. సంగతేవిఁటో నువ్వూ విను.

చంద్ర : సోవఁనాథంగారూ ! ఇప్పుడు మరావిషయం ఎత్తొద్దు.

సోమ : నే నొహటే, మా వాడొహటేనా? విన్నీ, వాణ్నీ విన్నీ !

చంద్ర : ఇందాట్లా ఏవఁని చెప్పేన్నేను?

సోమ : మరేం భయంలేదు. విన్రా అబ్బాయ్!

[జగన్నాథం బల్లమీద పేపరు తీసుకొని వెళ్లి మంచంమీద కూర్చున్నాడు]

జగ : మావఁయ్యేణాన్నా ?

సోమ : మావఁయ్యా?

జగ : అవును.

చంద్ర : లేరు. కాకినాడ వెళ్ళేర్ట.

సోమ : అవును. కాకినాడ వెళ్లేడు.

జగ : ఎప్పుడొస్తాడు?

సోమ : సోంవారం.

జగ : సోంవారంవా ?

సోమ : అవును.

జగ : పొద్దుట బండీకా ?

సోమ : పొద్దు బండీకే.

జగ : అత్తయ్యనీ అమ్మల్నీ తీసుకొస్తాడా?

సోమ : తీసుకొస్తాడు ?

జగ : మావఁయ్య కాశీ వెళ్లాలన్నాడు ?

సోమ : వెళ్తాడు.

జగ : శివరాత్రికా ?

సోమ : శివరాత్రికి.

జగ : నువ్వూ వెళ్తావు కదూ ?

సోమ : వెళ్తాను.

జగ : చంద్రశేఖరంగారూ! మానాన్నకోపం తగ్గింది. మరింక మీరు మామూలుగా మాట్లాడొచ్చు.

చంద్ర : బలే వాడివే !

సోమ : అందుకే మావాడి సలహాకూడా తీసుకుందాఁవన్నాను.

జగ : నేనెళ్లొస్తాను, శేఖరంగారూ.

చంద్ర : నీఇష్టం.

సోమ : కూచోరా జగ్గన్నా.

చంద్ర : పనుందేమో? వెళ్లి నీయండి.

సోమ : వాడేం పైవాడుకాడు. నాకు తెలిసిన మీదట వాడికి తెలిస్తే ఫరవాలేదు. విన్నావా ?

చంద్ర : అవున్లెండి. తరవాచూద్దాం.

సోమ : పిసినారివాడి భోషాణప్పెట్టెలాంటివాడు మావాడు. అంతా గ్రహించడవేఁగాని పైకేదీ ఒదల్డు.

చంద్ర : సరి నేనేం కాదన్లేదే!

జగ : నేవెళ్తాన్నాన్నా.

సోమ : ఉండ్రా. వెళ్తాను వెళ్తానంటూ మధ్యనువ్వొహడివి.

జగ : శేఖరంగారూ! ఏవిఁటి విషయం? నాన్నెవరికి నడ్డిరగ్గొడదావంటున్నాడు? చెప్పండి ఫరవాలేదు.

చంద్ర : అబ్బే. అదేం కాదోయ్. ఇప్పుడెవర్నీ తన్నవలసిన పనేంలేదు. మీనాన్నగారేదో కోపం చేతలా అన్నారంతే.

జగ : ఎవర్నితన్నాలంటున్నాడో చెప్పండి మరేం చెప్పక్కర్లేదు.

చంద్ర : మోహన్రావని ఓ పెద్దమనిషున్నాడు వాణ్ణి, మీ నాన్నేదో అలా అంటున్నారు. ఎక్కడా ఏఁవీఁ అనకు.

జగ : ఎక్కడా ఎఁవీఁ అనను. మరి నేనోస్తాను (అంటూ కదిలేడు)

సోమ : మిగతా భోగట్టా కూడా విన్రా మరీ!

జగ : మిగతా భోగట్టా నాకు తెలుసు.

చంద్ర : ఏవిఁటి !

సోమ : ఏవిఁటి తెలుసున్రా నీకూ?

జగ : మన...మోహన్రావూనూ మరి మన...

సోమ : తెలుసూ ?

జగ : తెలుసు.

చంద్ర : అందరికీ అప్పుడే తెలిసిపోయిందా ఏవిఁటి?

జగ : అందరికీ తెలీదు.

సోమ : మరి నీకెలా తెలిసింది ?

జగ : నాకు తెలుసు. అంతే.

చంద్ర : అలా కూర్చో జగ్గన్నా.

జగ : నేనుండాలంటారా?

సోమ : ఉండాల్రా, ఒరే శేఖరం మరిప్పుడుమనవేం చెయ్యడం?

జగ : పెళ్లాన్నానే అంటున్నాడా ?

చంద్ర : అవును.

సోమ : బుర్ర బద్దలగొడితే అప్పుడంటాడు పెళ్లాడతానని, అంతవరకూ అన్దు.

చంద్ర : మీరదే కాని మరో వుపాయం చెప్పరు.

సోమ : రౌడీ వెధవల్తో అదే ఉపాయం.

జగ : మీకేదో ఆలోచనున్నట్టుంది ?

చంద్ర : ఉంది.

జగ : ఏవిఁటో చెప్పండి.

చంద్ర : ఇప్పుడీ సంగతి కుటుంబయ్యగారికి తెలియకూడదు.

జగ : తెలియకూడదు.

సోమ : తెలిస్తే దాన్నీవాణ్నీ చంపేసి వాడూ చస్తాడు.

చంద్ర : పెళ్లయాక్కావలిస్తే చెప్పొచ్చు.

జగ : అవును.

సోమ : అప్పుడైనా వాడేం చేస్తాడో చెప్పలేం. మరీపరిస్థితిలో నేకూడా దగ్గిరుండి చేయించే నంటే అప్పుడు కొంత సర్దుకోవచ్చు.

చంద్ర : ఆ మోహన్‌గాడు వాడిప్పు డేవిధంగానూ పెళ్ళికొప్పుకో నంటున్నాడు.

జగ : ఎంచేత ?

సోమ : తెగులూ ! అంచేత.

చంద్ర : పెళ్లాడతానని తను అనలేదట. అయితే మరెందుకు చేసేవాపనంటే...

జగ : సరదాకి చేసేననుంటాడు.

చంద్ర : అంతే! ఇప్పుడు కావఁలిస్తే డబ్బిచ్చేస్తానంటాడు.

సోమ : డబ్బిచ్చేస్తాడా ?!! గొయ్యితీసి కప్పెట్టెయ్యాల్రా గాడిదకొడుకునీ, లాభం లేదు. మర్లాభం లేదురా.

చంద్ర : మీరలా కేకలేస్తే లాభం లేదండీ సోమనాథంగారూ !

సోమ : లేకపోతే, డబ్బిస్తానంటాడా? పీక నులిఁవేస్తాను.

చంద్ర : అలాగే నులివేఁద్దురుగాని; ముందు నే చెప్పేది వినండి.

సోమ : వింటున్నా. చెప్పు.

చంద్ర : ఇవాళో రేపో రమణయ్యగారితో కూడా మాట్లాడతాను.

జగ్గ : కొడుకు నతను ఒప్పించగల్డా ?

సోమ : వాడి శ్రాద్ధం ఒప్పించగల్డు. వాడొప్పించ లేడు.

చంద్ర : ఏమో చూదాం.

సోమ : వాడొప్పించలేడ్రా!

చంద్ర : అడిగిచూదాం, పోయిందే వుంది ?

సోమ : సరే అదీ బాగానే ఉంది. పెద్దవాడు కదా. ఇంగితజ్ఞానఁ వుంటుందనే అనుకుందాం.

చంద్ర : అది కూడా లాభంలేకుండా ఏదీ కుదర దన్నాడు...

సోమ : ఏదీ కుదరన్నాడు ?

చంద్ర : ఎల్లుండాదివారం సాయంకాలం మీరు నా ఇంటికి రావాలి.

సోమ : ఎవర్రావాలి?

చంద్ర : మీరు.

సోమ : ఎందుకూ?

చంద్ర : చెప్తా నుండండి. ఈ సంగతి మరెక్కడా తెలీకూడదు.

సోమ : నరమానవుడన్న వాడికి తెలీ నివ్వను.

చంద్ర : అయితే ఇలా దగ్గరకి రండి. జగ్గన్నా, నువ్వూరా!

[వాళ్లు దగ్గరగా వచ్చేరు]

సోమ : ఉరేవ్! శేఖరం!

చంద్ర : ఏవిఁ?

సోమ : అసలు నీ కెలా తెలిసిందిరా ఈ సంగతీ?

చంద్ర : చెప్తున్నా కదూ!

సోమ : నీకు తెలిసినట్టుగా కావేఁశ్వరికూడా తెలుసునన్నమాటేనా?

చంద్ర : అన్నమాటే కాకపోతే ఆమె తరఫున ఎలా వ్యవహరిస్తున్నానండీ?!

సోమ: : మరి నేనెలా వ్యవహరించడం? తెలిసినట్టా తెలియనట్టా?

చంద్ర : ఆమెతో చెప్పే మీతో చెప్తున్నాను మిమ్మల్నిక్కడొదిలేసి మీ ఇంటికి ఒట్టేనే వెళ్ళిందనుకుంటున్నారా ఏమిటి?

సోమ : అమ్మా! అమ్మా! అంతదయిందిరా, నా కళ్లముందు పుట్టిన కావేఁశ్వరీ?

చంద్ర : కష్టంలో ఉన్నప్పుడు లోకం సంగతంతా ఇట్టే తెలుస్తుంది. అంత చిన్నపిల్లా అర క్షణంలో అన్నీ తెలుసుకుంటుంది.

సోమ : బాగా చెప్పేవు.

చంద్ర : మరిప్పుడు ఐడియా ఏవిఁటో చెప్తాను వినండి.

సోమ : వింటున్నాం. చెప్పు.

[తెర]

4

* * రమణయ్యగారింట్లో హాలు. పెద్ద సోఫాలో కూర్చున్నాడు రమణయ్య. రాత్రయింది. పైన విద్యుద్దీపం—ఒక్కటే — వెలుగుతోంది. రమణయ్య, పంచె జుబ్బా వేసుకున్నాడు. నీరసంగా కనిపిస్తున్నాడు. చంద్రశేఖరం అతని పక్కకి ఓ కుర్చీ లాక్కుని కూర్చొనివున్నాడు.

చంద్ర : ఈ సమయంలో మీతో ఈ ప్రసక్తి తెద్దామనుకోలేదు. కాని మరి ఆపిల్లకిది ప్రెస్సింగ్ ప్రోబ్లమయిపోయింది. అంచేత చెప్పేను. చెప్పక తప్పింది కాదు.

రమ : చెప్పేవు. బాగా నేవుంది. తప్పేం లేదయ్యా.

చంద్ర : మోహన్ కనిపించేడా?

రమ : లేదు.

చంద్ర : మరైతే ఎలాగ? ఇవాళ కాని చెప్తారా?

రమ : నిన్న రాత్రి కదూ నాతో చెప్పేవు?

చంద్ర : అవును.

రమ : నిన్న పొద్దుట్నుంచీ ఇప్పటిదాకా వాడు నాకంటపళ్ళేదు.

చంద్ర : అయితే ఏం చేదాఁవంటారు?

రమ : చూడబ్బాయ్ శేఖరం!

చంద్ర : ఏఁవిటి?

రమ : లాభం లేదు. నోయూజ్.

చంద్ర : ఏఁవిటి లాభం లేదు?

రమ : నేను వాడితో చెప్పి ప్రయోజనం లేదు.

చంద్ర : చెప్పకుండానే అలా అనేస్తే ఎలా?

రమ : లాభం లేదయ్యా; లాభం లేదు. వాడి సంగతి నాకు తెలుసు.

చంద్ర : అయినా పెద్దవారు, చెపితే ఏఁవంటాడో చూడొచ్చు.

రమ : మామూలప్పుడే నామాట ఖాతరు చెయ్యడు. ఇప్పుడు మరీను.

చంద్ర : మీరే-యిలా అనేస్తే ఇప్పుడాపిల్లగతేం కాను?

రమ : ఆపిల్లసంగతి తల్చుకొంటే నాకు చాలా విచారంగా వుంటోంది.

చంద్ర : క్షమించండి, మీ విచారా న్నామేం చేసుకొంటుంది? ఏదైనా దారి చూపించాలిగాని.

రమ : డబ్బేవైనా ఇవ్వాలంటావా?

చంద్ర : డబ్బిస్తే సెటిలయ్యే వ్యవహారం కాదు కదండీ. అలా అయితే ఇదివరకే సెటిలైపోను. మీరూ

మోహన్లాగే మాట్లాడుతున్నారు.

రమ : అవునయ్యా, డబ్బుతో లాభంలేదు. ఐతే నేనేంచెసేది?

చంద్ర : మీవల్లేం కాదంటారు!

రమ : నావల్లేం అవుతుందనుకోనయ్యా! వాడు నాకొడుకే. అయితే? లాభంలేదు. జులాయివెధవై పోయేడు. పనికిమాలిన వెధవై పోయేడు. మర్లాభంలేదు. [ఇంతలో సోమనాథం వచ్చేడు హఠాత్తుగా.]

సోమ : ఏఁవిఁరా రమణయ్యబాబూ? ఒంట్లో ఎలా ఉంది (అంటూవచ్చి ఓ సోఫాలో కూర్చొంటూ శేఖరంతోఁ ఏరా బాబూ ఉన్నావా (అన్నాడు)

రమ : మీరెవరయ్యా?

సోమ : నేనూ సోమఁనాథాన్ని, మర్చిపోయేవూ?

రమ : ఎవరోయ్ శేఖరం?

చంద్ర : ఆయన టీచర్ గా పన్చేస్తున్నారు.

సోమ : ఆవేళ ఒచ్చేను కదుటయ్యా?

రమ : ఏవేళ?

సోమ : టెలిగ్రాం వొచ్చిందీ. ఆవేళ.

రమ : అవునవును. మీరూ ఉన్నారావేళ— మావాడు, మా పెద్దవాడు పోయేడు తెలుసు కదూ?

సోమ : ఆరోజు స్వయంగా టెలిగ్రాం చదివితేనే! ఛడ్డఘోరం చెడ్డఘోరం జరిగిపోయింది. సంగతివిని విచారించని వాళ్ళేరనుకో.

రమ : నాకిలా నిద్దరపడట్టడంలేదు. తల భారంగా ఉంటోంది. ఎవరోఒచ్చి నెత్తిమొత్తేసినట్టుగా ఉంది.

సోమ : చేతికందినవాడు, చెట్టంత కొడుకు ఒక్కసారి చెక్కలైపోతే ఎలా ఉంటుందో నాకు తెలుసున్నా బాబూ, నాకు తెలుసు. కాని ఏం చేస్తాం? ఎంత కావలసినవాడైనా, ఎంత దుఃఖ మొచ్చినా చచ్చినవాడితో మన మూ చావలేంకదా! అంచేత విచారించకురా నాయనా విచారించకు.

రమ : విచారం కాకపోతే ఇంకేఁవుందండీ! చచ్చిపోయి వాడేడిపిస్తున్నాడు. బలికుండీ వీడేడిపిస్తున్నాడు. ఏడుపుకాక ఇంకేఁ వుంది నాకు?

సోమ : అలా కూర్చుంటే ఏడవాలనే ఉంటుందిరా. చూడూ! రేపణ్నించీ చక్కా ఆఫీసుకెళ్లిపో. ఓ దస్త్రాలో మళ్ళీ పడ్డావా కొంతకాకపోతే కొంతైనా మనసు చులకనవుతుంది. నామాట విని అలా చెయ్యి. నీ మామూలు పన్లేవిఁటో అవి చూసుకో.

రమ : నా మామూలు పన్లంటే పొద్దున్నించి సాయంకాలం దాకా డబ్బు తేవడం, దాన్ని పెంచడం అవేకదుటండీ. ఆ పన్లు నేనిప్పుడు చెయ్యలేను, చెయ్యలేను.

సోమ : పోనీ మరో పన్చెయ్యి. పెరట్లో అరిటిచెట్లగ్గొప్పు తవ్వు. వీధిలో వేపమొక్క దగ్గిరుండి వేయించు. పొట్లపాదుకి నీళ్ళుతోడిపొయ్యి. ఏదో ఒహటి చెయ్యి. నా మాట విను. అలా ఏకుస్తూమాత్రం కూచోకు.

రమ : నే నేపనీ చెయ్యలేనండీ. ఇంక మరింతే.

సోమ : బాబ్బాబలా అనకు!

రమ : ఆర్జించిందేదో ఆర్జించేను. ఎందుకూ? ఏం లాభం? శుష్కదండగ. శుష్కదండగ.

సోమ : అయిపోయిందేదో అయిపోయింది. మరి విచారించకు.

చంద్ర : మీరువెళ్ళి మరింక రెస్టుతీసుకోండి. ఇక్కడ కూర్చుంటే ఏదో మాట్లాడాలనే ఉంటుంది.

రమ : జీవితఁవంతా ధారపోసి ఇంతాస్తీ ఎందుగ్గణించేనండీ? ఎందుకు? అఖరికొక జులాయివెధవ, ముండలకీ, తాగుడికీ, పేకాటకీ ఖర్చుపెట్టడానికితప్ప మరెందుకు? వీడికాళ్లు పట్టుకుని, వాడికాళ్ళు పట్టుకుని, వీణ్నీ వాణ్నీ మాయచేసి, అడ్డొచ్చినవాణ్నల్లా తొక్కి పారేసి ఇంతసొమ్మూ సంపాదించిందెందుకూ! ఓకొస పింజవెధవ తప్పతాగి గుడ్డలిప్పుకొని, ముండల్ని పట్టుకుని, చిందులొక్కడానిగ్గణించేను.

సోమ : ఎవరు చిన్నవాడిగురించిట్రా చెపుతున్నావూ? ఏవిఁరా శేఖరం! అంతేనా? చిన్నవాడిగురించేనా?

చంద్ర : మీరేం రెచ్చగొట్టకండి సోమనాథంగారూ! ఆయన్ని మాట్లాడ కూరుకోనివ్వండి.

సోమ : వాడిగురించంత బెంగెందుకురా రమణయ్య బాబూ!?

రమ : ఆఖరికొక ఆకతాయివెధవ, భ్రష్టువెధవకప్ప గించడానికే లైఫంతా రూయిన్ చేసుకుని ఇంతా కష్టపడి ఇదంతా ఆర్జించేను. క్రిమినల్సూ, వేగబాండ్సూ, స్కౌండ్రల్సూ తయారవడంకోసం ఇంతకష్టపూం పడ్డాను. వేస్ట్ వేస్ట్, లైఫంతా క్రిమినల్ వేస్ట్!

సోమ : అలా ఎందుకు డీలా పడిపోతావురా!? ఎల్ల కాలం వాడలాగే ఉంటాడనుకోవాలా?! మనుషులు మారరూ?! నామాటవిని కుర్రాడికి బలవంతానైనా పెళ్ళిచేసిపారీ, పెళ్ళాం వొచ్చి అశిరమ్మలా పీకలమీద కూచుందిరా అంటే అన్ని తిరుగుళ్ళూ అన్ని సంకటాలూ ఇట్టే అణిగిపోతాయి. నామాట వినలా చెయ్. వేగిరం పెళ్ళిచేసీ (అంటూ శేఖరంవైపు మీనింగ్ ఫుల్ గా చూసేడు)

రమ : వాడికి పెళ్లిచేసి ఏ ఆడపిల్ల గొంతుకా నే కొయ్యలేనండీ.

సోమ : పెళ్లయితే అదే వాణ్ణి తిప్పుకోగల్దు. మరేం భయంలేదు. అదే వెళ్ళి వాడిగొంతుక పట్టుకుంటుంది.

రమ : అబ్బే లాభం లేదండీ లాభం లేదు. అయీ చెట్టు ఆకుల్లోనే తెలుస్తుందనేది మా అమ్మ. ఈ వెధవ నా వంశానికి విషబీజంలా మొలకెత్తేడు. సర్వనాశనం చేసి పారేస్తాడు.

సోమ : అలా అనుకోకురా!

రమ : అంతే నండీ! అంతే! నా యింట్లో విష వృక్షం విస్తరించుకూర్చుంది. నీ సారం నీసారం పీల్చుకు తినేస్తుంది. నిన్నూ నన్నూ మాడ్చి చంపేస్తుంది. పునాదుల్తోటే ఇంటిని కూల్చేస్తుంది. ఆఖరి కెవడో ఒహడొచ్చి నరికి పారేస్తాడు. తీరిపోతుంది.

సోమ : ఒరే రమణయ్యబాబూ!

చంద్ర : సోమనాథంగారూ! మీ రిక్కడ కెందు కొచ్చినట్టు?

సోమ : వీణ్ణోసారి చూద్దామనొచ్చేన్రా.

చంద్ర : చూసేరుకదూ?

సోమ : ఆ!

చంద్ర : మర్లెండి.

రమ : కూర్చోనీవోయ్ అతణ్ణి.

చంద్ర : మీ రింక వెళ్ళి పడుక్కోవాలండీ. ఆయన్ని వెళ్లనీయండి.

సోమ : నిన్నుకూడా చూదామనొచ్చేన్రా.

చంద్ర : మనం అనుకున్న విషయమయేనా?

సోమ : మరి దేనిగురించనుకున్నావు?

చంద్ర : ఇక్కడేం లాభంలేదు. రేపు మనం అనుకున్న ప్రకారం చెయ్యవలసిందే.

సోమ : (రమణయ్య చూడకుండా అతన్ని శేఖరానికి చూపిస్తూ) లాభం లేదా?

చంద్ర : లాభం లేదు.

సోమ : మరైతే నే పోనా?

చంద్ర : వెళ్లిరండి. రేప్పొద్దుట మళ్లీ కలుస్తాను.

సోమ : ఒస్తారా రమణయ్ బాబూ!

రమ : వెళిపోతున్నారా? కొంచెంసేపు కూర్చోరూ!

సోమ : నేను కూచుందికేం? కాని నువ్వు-చూడూ-రెష్టు తీసుకోవా లంటున్నాడు శేఖరం. వాడు చెప్పినట్టూ చెయ్యి, పోయి పడుకో. మళ్ళొస్తాను. (శేఖర్ తో) ఒస్తారా.

చంద్ర : మంచిది.

సోమ : (గుమ్మందాకా వెళ్లి) రేప్పొద్దున్నోసారి కనిపించాలిసిందీ.

చంద్ర : అలాగే.

సోమ : మర్చిపోయేవు గనక.

చంద్ర : ఒస్తాను. మర్చిపోను.

సోమ : మళ్ళి వెళ్తాను. (అని వెళ్లిపోయేడు)

చంద్ర : రమణయ్ గారూ!

రమ : (వినలేదు)

చంద్ర : రమణయ్యగారు!

రమ : ఏవిఁటయ్యా?

చంద్ర : నే చెప్పేది కొంచెం వినండి.

రమ : ఏవిఁటి?

చంద్ర : "మా వాడు చెడ్డవాడు. వాడికి పెళ్లి చేసి ఏ ఆడపిల్ల గొంతుకా నే కొయ్యలేను" అంటూ

ఆ కబుర్లూ ఈ కబుర్లూ ఇప్పుడు చెప్పి లాభం లేదు. వింటున్నారా? మంచివాడైనా సరే చెడ్డవాడైనా సరే మీవాడు ఇప్పుడా పిల్లని పెళ్ళాడితీరవలసిందే! అలా అని ఒప్పుకుంటారా? ఒప్పుకోరా?

రమ : ఒప్పుకోవలసిందే మరి.

చంద్ర : డబ్బిచ్చేస్తే ఊరుకుంటుందా? అని మీ వాళ్లాగే మీరూ అనుకద!?

రమ : అనలయ్యా అనను. ఇందాట్లా ఏదో పొర పాటున అన్నాను.

చంద్ర : మీవాడు మరిప్పుడు ఆపిల్లని పెళ్లాడ్డానికి ఒప్పుకోడం లేదు.

రమ : ఒప్పుకోడం లేదని చెప్పేవుకదూ?

చంద్ర : మీరేవైఁనా చెప్పి ఒప్పించగల్రా? లేరా?

రమ : విన్లయ్యా వాడు నామాట విన్డు.

చంద్ర : వినకపోతే పోనీయండి. కాని, ఆపిల్లతో మీ వాడికి పెళ్లి ఏర్పాటవడం మీకిష్టవేఁగదా!?

రమ : ఇష్టవేఁ కదా అనడిగితే నే నేం చెప్పనోయ్?

చంద్ర : అయితే మీ కిష్టం లేదా?

రమ : ఏదో వాడికి పెళ్లింటూ ఒహటయితే నా కిష వేఁనోయ్. ఇష్టవేఁ.

చంద్ర : ఆ యేర్పాటంతా నే చూసుకుంటాను. పూచీ నా నెత్తిని ఒదిలేగల్రా?

రమ : నీ ఇష్టం వచ్చినట్టు కానీవోయ్. నీఇష్టం వచ్చినట్టు కానీ.

చంద్ర : అయితే, చూడండీ!

రమ : ఏఁవిఁటి?

చంద్ర : మరింక ఈ ప్రసక్తి మీవాడితో మీరు తేన క్కర్లేదు. తేకండి.

రమ : సరేనోయ్. సరే.

చంద్ర : నే నేదోవిధంగా అంతా ఏర్పాటు చేస్తాను.

రమ : నీ ఇష్టం.

చంద్ర : అంతా ఏర్పాటయాక మిమ్మల్నాశీర్వదించ డానికి రమ్మంటే రాగల్రా ?

రమ : (ఒక్క క్షణం వుండి) దానికేఁవుంది? ఒస్తాను.

చంద్ర : అయితే నేనంతా ఏదోవిధంగా సెటిల్ చెయ్యడానికి మీరు సమ్మతించినట్టేనా ?

రమ : మళ్ళీ అడగాలా అది ?

చంద్ర : థాంక్యూ వెరీమచ్! మరైతే చూడండి· ఇప్పుడు పద్దగ్గిరవుతోంది.

రమ : వెళిపోతావా నువ్వు? ఇంట్లో ఎవరూ లేరే

చంద్ర : సర్వెంటొచ్చే దాకా నేనుంటా లెండి.! మీరు వెళ్ళి మరి పడుకోండి.

రమ : నాకు నిద్దర పట్టడం లేదోయ్:

చంద్ర : అదే పడుతుంది. వెళ్ళి పడుకోండి. ఊఁ లెండి.

రమ : లేవనా ?

చంద్ర : లెండి లెండి.

రమ : (నెమ్మదిగా లేచి ఒక రెండడుగులు వేసేడు) ఒళ్ళు జోగుతోందోయ్ !

చంద్ర : జోగదలా నెమ్మదిగా వెళ్లండి.

[రమణయ్య నెమ్మదిగా మెల్లెక్కి మేడ మీదికి వెళిపోయేడు. మర్నాటి కార్యక్రమం గురించి ఆలోచిస్తూ శేఖరం అటూ ఇటూ పచారు చేస్తున్నాడు. వీధివైపు మోటారు సైకిలు ఆగిన చప్పుడయింది. కాసేపట్లో మోహను హాల్లోకి వచ్చేడు.]

మోహ : హా...లో !

చంద్ర : ఒచ్చేవా బాబూ! నీ కోసవేఁ చూస్తు న్నాను.

మోహ : రాత్రయినా ఇక్కడే ఉన్నావూ ?

చంద్ర : ఉన్నాను. చూట్టం లేదూ ?

మోహ : ఏంచేస్తున్నావిక్కడింతసేపు ?

చంద్ర : నీ కోసం ఎదురుచూస్తున్నాను.

మోహ : ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా ఉంది. నా ఆత. బంధువులంతా కొంపతీసి వెళిపోయేరా ఏవిఁటి ?

చంద్ర : వెళిపోయేరు.

మోహ : హా! నిష్క్రమించిరా ?

చంద్ర : నిష్క్రమించేరు.

మోహ : మే గాడ్ బ్లెస్ దెమ్ !

చంద్ర : బంధువులంటే ఏఁ వంతభిమానం ?!

మోహ : వాళ్లు మఱ్రెండ్రోజులుంటే నేను పిచ్చాస్పత్రికి పోయుందును. బంధుకోటి బాధనే భరించజాల, భరించజాల.

చంద్ర : అంత కష్టమేం నీకదీ?

మోహ : ఎవరైనా ఇంట్లో చావడం భయం. పరామర్శ ప్రియులు ముఖ్యంగా బంధువులు తండోప తండంబులుగా దండెత్తి వత్తురు. కన్నీటితో మనను తడపి వేయుదురు. ప్రాణంబులు మనవి పీకి వేయుదురు.

చంద్ర : సరే వాళ్లగోలా నీ గోలా అలావుంచి ముందుగా నామాట విను.

మోహ : నా యొక్క చుట్టాలూ పక్కాలూ నిజంగా వెళిపోయినట్టేనా?

చంద్ర : వెళిపోయేరని చెప్పేకదూ.

మోహ : వాళ్ల గోలయిపోయింది. మరి నీగోలేవిఁటో చెప్పు.

చంద్ర : తమ రాక్కోసం ఎదురు చూస్తున్నానని చెప్పేనా? లేదా?

మోహ : చెప్తివి, నిజమే!

చంద్ర : ఎందుకు మరి నీకోసం వెయిట్ చేస్తున్నానో అడిగేవా?

మోహ : అడుగుచున్నాను. చెప్పుము.

చంద్ర : ఏం లేదు. కామేశ్వరీ...

మోహ : ఆఁ కామేశ్వరి? (అని కొంచెం గాభరా పడ్డాడు).

చంద్ర : (జవాబివ్వలేదు).

మోహ : కామేశ్వరేవిఁటి? ఏవిఁటంటుంది కామేశ్వరి? ఏమైఁనా అందా?

చంద్ర : అంతటితో ఉంది అయ్యగారి పస!

మోహ : యూ మీన్ టు సే... నేను భయపడతానంటున్నావా?

చంద్ర : అబ్బే లేదు లేదు.

మోహ : దాన్ని చూస్తే నాకెందుకూ భయం?

చంద్ర : ఆమెన్చూస్తే నీకు భయఁవన్నానా? 'కామేశ్వరి' అని అన్నానో లేదో ఏవిఁటేవిఁటని గాభరాపడి పోతున్నావు మరి.

మోహ : గాభరా ఎందుకూ? మళ్లీ ఏమైనా అందేమోనని అడిగేనంతే.

చంద్ర : మరేం అన్లేదు.

మోహ : అంతా సెటిలయి పోయినట్టేనా?

చంద్ర : సెటిలై పోయినట్టే! వాళ్ళ ఫాదరు కాకినాడెళ్లేడు. ఎల్లుండొచ్చేస్తాడు. రాగానే మళ్ళీ మాట్లాడుకొని ఆ సంఖ్యేదో తేల్చేసుకుందాం. అంతా సెటిలైపోతుంది.

మోహ : సరే అలాగే కానీ, కాని చూడూ?

చంద్ర : ఏవిఁటి?

మోహ : వాళ్ళు ముందుకి మళ్లీ పేచీపెట్టకుండా మనం చూసుకోవాలి.

చంద్ర : ఎందుకు చూసుకోవూఁ? చూసుకుందాం.

మోహ : అంచేత ఆ సెటిల్ చేసేదేదో లాయర్ ద్వారా సెటిల్ చేయించేస్తే మంచిది.

చంద్ర : అలాగే చేదాం.

మోహ : మరి...వాళ్లకెవడైనా ప్లీడరున్నాడా?

చంద్ర : నాకు తెలిసినంతమట్టుకు లేదు.

మోహ : అయితే నేనొకటి చెప్తా విను.

చంద్ర : ఏఁవిఁటి?

మోహ : నువ్వంటే వాళ్లకి నమ్మకవేఁనా?

చంద్ర : నమ్మకవేఁ.

మోహ : అయితే నే చెప్పేనట్టు చెయ్యి

చంద్ర : ఏవిఁటది?

మోహ : నా వకీలున్నాడు తెలుసుకదూ?

చంద్ర : ఎవరు, శివశంకరంగారా?

మోహ : వాడి మొహం వాడూ వకీలే! మడికట్టు కోర్టు కెళ్తానంటాడు.

చంద్ర : మరెవరు నీ ప్లీడరు?

మోహ : నా ఫ్రెండు కుమారున్నాడు కదూ?

చంద్ర : కుమారా?

మోహ : అవును, కుమారే, జూనియరేకాని ఫ్యూచర్ లీడర్ ఆఫ్ ది బార్ వాడే. నాకు బాగా ఫ్రెండు. మనకి బాగా పనికొచ్చేవాడెవడంటే వాడు తప్ప మరోళ్లేడు. సత్యం అసత్యం ఇలాంటి నాన్సెన్సు కేర్ చేసే మనిషి కాడు.

చంద్ర : సరే అయితే ఏం చేదాఁవంటావు?

మోహ : మీకు చాలా మంచి వకీల్ని కుదురుస్తానన్చెప్పి వాళ్ళని మనవాడి దగ్గిరకి తీసుకురా. ఇంతకంటే ఎక్కువ సొమ్ము—ఖర్చులుండుగ తప్పించి—మీకు కోర్టెక్కినా రాదని వాడిచేత వాళ్ళకి చెప్పించేసి వీలైనంత తక్కువలో తేల్చేద్దాం. కాయితాలు కూడా కట్టుదిట్టంగా మనక్కావలసినట్టు రాయించేసుకోవచ్చు. ఏవంటావు? నా అయిడియా ఎలా వుంది?

చంద్ర : బ్రిలియంటుగా ఉంది.

మోహ : మరి చూడు మా ఫాదరేవంటాడోను. నాకు తెలివి తేటల్లేవు, పనికి మాలిన వెధవనంటాడు.

చంద్ర : నీకు తెలివి తేటల్లేక పోలేదు.

మోహ : మరైతే మా ఫాదర్తో అలా చెప్పవేఁవీఁ?

చంద్ర : అలాగే చెప్తాకాని నీ కోసం ఎందుకు వెయిటు చేస్తున్నానంటే కావేఁశ్వరి గురించి చెప్పడానిక్కాదు. ఆ విషయం సెటిలయి పోయినట్టే.

మోహ : మరేవిఁటైతే?

చంద్ర : రేపు సాయంకాలం నువ్వు మాలాడ్జికి రావాలి.

మోహ : ఏం?

చంద్ర : చిన్నపార్టీ.

మోహ : పార్టీయేల?

చంద్ర : నాకీ ఉద్యోగం ఒచ్చే కెవడికైనా ఎప్పుడైనా పార్టీ ఇచ్చేనా?

మోహ : ఇవ్వలేదు.

చంద్ర : మన ఫ్రెండ్సంతా ఇలా తినేస్తున్నారు. అంచేత రేపెరేంజి చేసేను. నువ్వుకూడా రావాలి.

మోహ : రానూ?!! పార్టీల కెళ్ళడమే నా మెయినాక్యుపేషనాఫ్ లైఫ్ కదా! అయితే ఎవరెవరొస్తారు? ఎన్నిగంటలకి?

చంద్ర : మన ఫ్రెండ్సే ఒచ్చేవాళ్ళు, సిక్సథర్టీకిరా. చాలు.

మోహ : ఆమిషఖండము వెన్నరొట్టెయున్:అవెలాగూ ఉంటాయి. మరి మిగతావి?

చంద్ర : తరువాయి తెరపై చూడుడు, నుశ్నేపోతా.

మోహ : రైటో.

చంద్ర : రేప్మర్చిపోకు.

మోహ : మరువను మరువను.

చంద్ర : అయితే గుడ్ నైట్.

మోహ : లాలా.

[తెఱ]

5

* * చంద్రశేఖరం వుండే యిల్లు చాలా చిన్నది. ముందుకో గది. వెనక్కో గది. మధ్య చిన్న నడవ. ముందు వైపు చిన్న వరాండా. వెనకవైపు చిన్నవరాండా. అంతే. చుట్టూ పెద్ద తోటుంది. తోటని అప్పట్లో కొట్టేస్తున్నారు. ఊరికది ఒక కొస. ఆ రోజు ఆదివారం; సాయంకాలం. శేఖరం ముందుగదిలో బల్లని ఆనుకొని నిల్చున్నాడు. ముందు గది విశాలమైనదనే చెప్పాలి. వీధివైపు ద్వారంపక్క ఓ కిటికీ ఉంది. దానికి నాలుగు తలుపులు. అడుగు తలుపు లెప్పుడూ మూసే వుంటాయి. గదిలో ఒకే మేజా ఉంది; నాలుగు కుర్చీలున్నాయి; ఒక వాలు కుర్చీ పేముది ఉంది. గోడల్ని రెండు గ్రూప్ ఫోటోలూ, ఒక కేలండరూ, ఒక పాత టెన్నిస్ రేకెటూ తప్ప మరేం లేవు. శేఖరం దగ్గర పనిచేసే వాడు చిన్నారావు వెనక గదిలో ఉన్నాడు. వాడికో నలభయ్యేళ్లుంటాయి.

చంద్ర : చిన్నా

చిన్నా : ఏంబాబూ?

చంద్ర : ఆష్ట్రే కూడా పట్టుకుపోయేవూ?

చిన్నా : ఇక్కడుందిబాబూ. తెమ్మంటారా?

చంద్ర : ఇలా తే

చిన్నా : తెస్తన్నా (అనిచెప్పివచ్చి ఆష్ట్రే తెచ్చి బల్లమీద పెట్టేడు)

చంద్ర : సోమనాథంగారొస్తున్నారేమో చూడు.

చిన్నా : పొద్దున్నొచ్చిన బాబేనాండి?

చంద్ర : ఆయనే.

చిన్నా : ఆయనైతే ఇంకారానేదండి.

చంద్ర : వెళ్లి చూడ్రా.

చిన్నా : నూడక్కర్లేదండి, ఆయనొస్తంటే మాట్లని పిస్తాయండి.

చంద్ర : ముందువెళ్లి చెప్పినపన్చెయ్యి.

చిన్నా : (వీధిలోకివెళ్లి వచ్చి) రానేదండి. దూరాంలో రిచ్చాయేదో ఒస్తందండి. అంతే.

చంద్ర : రాజారావుకూడా ఇంకారాలేదు. ఒస్తాడంటావా?

చిన్నా : ఒస్తడండి.

చంద్ర : ఏమోలే. డబ్బుకూడా కొంతెడ్వాన్సిచ్చీసేను.

చిన్నా : డబ్బుచ్చుకు రాకపోడండి. ఆ బయమేం న్నేదు.

చంద్ర : సరేలే, ఇప్పుడేంచేస్తాం?

చిన్నా : అశ్శిశ్శి! ఒస్తడండి.

చంద్ర : సరే నువ్వెళ్ళి నడవలో కూర్చో. మళ్లీ పిలుస్తే నేరాడం.

చిన్నా : అలాక్కానీండి.

చంద్ర : నడవలో నీదీ వాళ్లదీ సామ్రగంతా ఉందా?

చిన్నా : ఉందండి.

చంద్ర : సరే పోయికూర్చో.

[చిన్నా నడవలోకివెళ్ళేడు. ఇంతలో వీధిలోంచి "ఇక్కడే ఇక్కడే ఆపాపు" అని సోమనాథంమాటలు వినవచ్చేయి. కాస్సేపట్లో అతనూ వచ్చేడు.]

సోమ : (గుమ్మంలో నిల్చొని) ఏమిరా రావొచ్చా?

చంద్ర : రండి. ఇంకా ఎవరూ రాలేదు.

సోమ : (వెనక్కి తిరిగి) రామ్మా కామమ్మ తల్లీ. ఇలా! (అంటూ గదిలోకివచ్చేడు. ఆవెనకే కామేశ్వరి వచ్చింది.)

సోమ : (వాలుకుర్చీలో కూర్చొంటూ) అందాకా అలా కూర్చోవే అమ్మాయ్

చంద్ర : (సైమ్‌మాసుకొని) ఈకుర్చీలో అలాకూర్చో (అని ఓకుర్చీకొంచెం ఎడంగా ఈడ్చేడు)

కామే : అక్కర్లేదు(అని నడవగుమ్మందగ్గర నిల్చొంది)

సోమ : ఒరేశేఖరం!

చంద్ర : ఏమిటి సంగతి?

సోమ : చిన్నయీదీ పెద్దయీదీ ఈ ఆడవాళ్ళతో వేగలేంరా.

చంద్ర : ఏం? అలాఅనీసేరు?

కామే : నేనేదో అడిగేనని. అందుకూ.

సోమ : ఇంటికెళ్ళి తీసుకొచ్చేసా? ఇంటికెళ్లిన దగ్గర్నించి ఇక్కడకొచ్చేదాకా ఎన్నిప్రశ్నలేసిందో దాన్నడుగు.

చంద్ర : మీరుచెప్పండి. దేన్నిగురించి? (అంటూవెళ్లి వీధివైపు కిటికీదగ్గర నిల్చున్నాడు.)

సోమ : దేనిగురించా? ఒక్కదానిగురించే! దాని గురించి దారిపొడుగునా ప్రశ్నలే. అన్నీ అనుమానాలే. వేసినఅనుమానమే వెయ్యడం. అడిగినమాటే అటుతిప్పిటుతిప్పి పన్నెండ్రకాలుగా అడగడం. ఇన్ని సందేహాలూ ఇంతనుమానమూ ఉన్నమనిషి వెళ్లి వాడివల్లో ఎలా పడ్డాదో నాకర్థమవటం లేదు.

చంద్ర : సోమనాథంగారూ, మీరధికప్రసంగం చెయ్యకండి. ప్లీజ్.

సోమ : అడిగేవు కాబట్టిచెప్పేను. అదీతప్పే?

చంద్ర : ఏంకామేశ్వరీ! ఏమిటన్నీ అనుమానం?

కామే : అతనికీ పెళ్లి పూర్తిగా ఇష్టమేనా అనడుగుతున్నాను.

సోమ : హదిగో అదిరా! వాడు పూర్తిగా ఇష్టపడ్డాడా లేదా? నువ్వువాడితో స్వయంగా మాట్లాడేవా? మాట్లాడకపోతే నీకెలా తెల్సింది? ఎవరు స్వయంగా వెళ్ళి మాట్లా

జేరు? శేఖరంతో ఏమన్నాడో స్పష్టంగా చెప్పగలవా? నువ్వేమీ వినావినకుండా, చూడా చూడకుండా వాడొప్పుకున్నాడని ఎలా స్పష్టంగా చెప్తున్నావు? ఇది వరస. ఈ ప్లీడరు ప్రశ్నలన్నిటికి నే సమాధానం చెప్పగలన్రా?"

చంద్ర : మీరుండండీ.

సోమ : బోనెక్కి ప్రమాణంచేసి సాక్ష్యం చెప్పమంటే అది నా తరమవుతుందిరా?!

చంద్ర : మీరూరుకోండీ.

సోమ : ప్రమాణ పూర్తిగా నిజం చెప్తున్నావా అంటే జవాబిచ్చినప్పుడల్లా నెత్తిమీద రామాయణం పెట్టుకు జవాబు చెప్పగల్నా?

చంద్ర : మీరూరుకుంటారా ఊరుకోరా సోమనాథం గారూ?

సోమ : కాదుమాట వరసకి చెప్తున్నాన్రా!

చంద్ర : కామేశ్వరీ ఏమిటన్నీ అనుమానం? మోహన్‌కీ పెళ్లి పూర్తిగా ఇష్టమేనా అనా?

కామే : అవును.

చంద్ర : నేనింతకుముందు చెప్పేకదూ?! మళ్లీ ఎందుకూ అడగడం?

కామే : కాదు. ఆవేళ వాళ్లింట్లో అలామాట్లాడిన వారు ఇప్పుడెలా ఒప్పుకున్నారా అని?

చంద్ర : అది తెలుసుకోడంవల్ల ఇప్పుడు ప్రయోజనమేమైనా ఉందా?

కామే : అలా అంటే నేనేం చెప్పగల్ను?

చంద్ర : ఆరోజున వాళ్లింట్లో నీతో ఎందుకలా మాట్లాడేడో అది వేరే విషయం. అదలా ఉంచు. ఇప్పుడు మనవాడు ఏమీ ఇష్టం లేకుండా ఇక్కడకొస్తున్నాడని నువ్వెందుకనుకోవాలి?

కామే : (సమాధానం ఇయ్యలేదు.)

చంద్ర : చూడూ! ఇప్పుడీ అనుమానాలూ, సందేహాలూ, పెట్టుకూర్చుంటే లాభంలేదు. తెలిసిందా?

కామే : (మాట్లాడిందికాదు)

చంద్ర : నీ మంచికోసం నాకుతోచిన విధంగా ఏదో ఒక ఏర్పాటు చేసేను. ఆవిధంగా నడవనీ.

సోమ : చూడూ, అమ్మడూ! వాడు చెప్పినట్టు చెయ్యి. మరేం ఇబ్బంది లేదు.

చంద్ర : అందాకా వెళ్లి అలా ఆ వెనగ్గదిలో కూర్చో.

సోమ : అలా చెయ్యి.

[కామేశ్వరి గ్లూమీగా వెనకగదిలోకి వెళ్లింది]

సోమ : ఒరే అబ్బాయ్!

చంద్ర : ఇంకమీరేమిటంటారు?

సోమ : ఈ వయసు ఆడపిల్లల్తో చిక్కంటే చిక్కు కాదురాబాబూ. చెప్తే విన్రు విన్నా బోధపర్చుకోరు.

చంద్ర : అనుభవం తక్కువ మీద అలా ఉంటుందేమో?

సోమ : అనుభవం లేపోతే పోయింది. వెర్రాలోచన్లు లేకుండా ఉంటేచాలు. ఊహుఁ అలాగా లేదు. బుర్రనిండా భావకవిత్వమే.

చంద్ర : మోహన్‌గాడు దగాచేస్తే మధ్య ఆమె భావకవిత్వమేం జేసింది?

సోమ : నీకళ్లూ నాకళ్లూ పెట్టుకుచూస్తే వాడి నిజస్వరూపం కనిపిస్తుంది. భావకవిత్వం గాళ్ళకి వాడు నవమన్మథుల్లాగే కనిపిస్తాడుగాని పరమ దొంగల్లోభష్టు రకంగా కనిపించడు.

చంద్ర : (ఒక క్షణం ఉండి) అవును. సరిగ్గానే చెప్పేరు.

సోమ : భావకవిత్వం కొంచెం కొంచెం ఒదిలిపోతోంది. అంచేత ఇంతయాక ఈ రోజుకి మనమ్మాయిగారికి వాడి నిజంబొమ్మ తెలుసుకుందామని బుద్ధి పుట్టింది.

చంద్ర : వాడి నిజంబొమ్మంత చూడరాని బొమ్మా?

సోమ : ఏం? నీకు తెలీదేమిటి? నన్నడుగుతున్నావు?

చంద్ర : (అటూ ఇటూ పచారుచేస్తూ) తికమకలో పడ్డాను సోమనాథం గారూ!

సోమ : ఏమిటూ తికమక?

చంద్ర : ఏం లేదు. (అని మళ్లీ పచారుచేసి) పీళ్లేదండీ వాడలా అన్యాయం చేసి చేతులు దులిపేసుకొందికి పీల్లేదు.

సోమ : దేన్ని గురించలా మాట్లాడు తున్నావురా? ఏం వొచ్చిందిప్పుడు?

చంద్ర : ఏం లేదు.

సోమ : ఏఁవిఁటో చెప్పకూడదూ?

చంద్ర : ఏం లేదు. మీ జగ్గన్నేడీ?

సోమ : మా వాడా?

చంద్ర : మీ వాడే!

సోమ : (నెమ్మదిగా) మరి మా వాడొస్తున్నట్టు (వెనక గదివైపు చూపిస్తూ) దీనికి తెలీకూడదు కదూ. అంచేత వాణ్ణి అడుగు వెనక రమ్మన్నాను.

చంద్ర : సరే బాగానే ఉంది. కాని రాజారావింకా రాలేదు.

సోమ : రాజారా వెవరు?

["రాజారా వంటే ఈడండి" అంటూ అప్పుడే గదిలోకి ప్రవేశించేడు రాజారావు. పాతికా ముప్ఫైసంవత్సరాల మధ్య వయసు వాడు. పొడవుగానూ, వెడల్పుగానూ, ఉన్నాడు. ఎత్తుగా దట్టంగా ఉన్న జుట్టు పెద్దని ఎర్రటి కళ్ళు. నలుపని చెప్పడానికి వీల్లేని చాయ. మనిషి బలంగా ఉన్నాడు. పొడుంరంగు బుష్‌కోటు తొడుక్కున్నాడు నిక్కరు నల్లటిది.]

చంద్ర : ఒచ్చావా! ఇంకా రాలేదం చెప్మా అనుకుంటున్నాను. అందాకా అలా కూర్చో.

[వీధి గుమ్మం వైపు ఒక చిన్న స్టూలుంది.]

రాజా : (స్టూలుమీద కూర్చొంటూ) మేజ్‌స్ట్రీట్ కచేరీకా డియూల్లేటయిపోనాదండి.

సోమ : వీడెవర్రా?

చంద్ర : మనపనిమీదే ఒచ్చేడు, మనవాడే, ఏం? మీతో చెప్పేకదూ?

సోమ : మరోమనిషొస్తాడని చెప్పేవు, ఊరూ పేరూ చెప్పేవా?

చంద్ర : ఇతగాడే ఆమనిషి.

రాజా : (జేబులోంచి అగ్గిపెట్టే, బీడీతీసి) బీడి కాల్స్తనండి.

చంద్ర : కాల్చుకో.

[సోమనాథంచుట్టా, రాజారావు బీడీ ఒక్కసారే ముట్టించేరు]

చంద్ర : ఎప్పుడూ లాఠీపట్టుకు తిరుగుతూ ఉంటావట? ఇవాళ తేలేదేం?

రాజా : (పొగవదిలి) నా రొండుసేతులూ రొండు లాటీలండి.

చంద్ర : సరేలే, వాటవసరవేం ఉండదనుకో, కొంచెం అల్లరేకుండా చూడంతే.

రాజా : మనవుఁన్నెసోట మరో డల్లరిసెయ్యడానికీ ల్లేదండి. అ ద్దేవుఁడు సెప్పినమాటేనండి, ఓ పాలిలాగే తల్లిమాలచ్చిమ్మగుడికాడ దీపాల పాంబిగాడేటన్నాడంటే, నాయెదటకొచ్చి "ఏట్రో నీఅల్లరీ" అన్నడండి. అన్నాడో నేదో యెయ్యిదీపాలొక్క పాలవుపించేలా ఈశ్చికొట్నానండి, కొత్తే మూడంతర్లుకొట్టి ముప్పైగజాలెల్లి తూలిపడ్డడండి, అప్పుణ్ణానే ఎల్లి నెగదీసి సెప్పేనండి. "ఓరి దుంపవీధి దీపాల పాంబిగా! ఈ డెవడను కొంటున్నావూ? ఈడు కొత్తపేట రాజిగాడన్న సంగతి మర్సిపోకు. యెయ్యి చిరసనూసె బుడ్లయితే మాత్తరం ఒక్క పిట్టరమెంటు నైటుకిసాటా? నువ్వు చిరసనూసె బుడ్డివి. నాను పిట్టరమెంటు నైట్ని. నా కాలిగేచోట నువ్వెలక్కూడదూ! అందుచేత ఇక్కణ్ణించి అగిజెంటుగాంగా బరిమీదిలిపో" అన్ననండి. దాన్తో నానుకర్సుకిచ్చిందుచ్చుకొని అరిజెంటుగాంగా బరిమీద దుంప వీధిలిపోన్డండి, మరప్పణ్ణించి నాయెదర పడితోట్టండి.

చిన్నా : రాజిగాడొచ్చినాడేటండి? మాటినిపిస్తుంది (అంటూ నడవవైపునుంచి గదిలోకి వచ్చేడు చిన్నారావు)

రాజా : ఏఁరోయ్ సినయ్‌మాఁవాఁ!

చిన్నా : ఏఁరోయ్ బావ్‌మర్ది!

చంద్ర : ఎందుకురా చిన్నా? ఇక్కణ్ణే కంపని? అక్కడేకూర్చో, వెళ్ళు.

రాజా : పనేటిలేకండా కూకుండమంటే ఎంచక్క కూకుంటాడండి మాసినయ్‌మావ. పనొస్తే మాత్తిరం, గట్టిక్కే కేస్తేశాన, సెయ్యెత్తి దణ్ణవెట్టేస్తడండి.

చిన్నా : ఎళ్లెల్రా! నా నోల్లకుంటేకదా నువ్వు కొత్తపేటకి రగిడీసవుత! ఎక్కువ్వాడెవుడో ఎరిగి నడుసుకో.

రాజా : బేపి నుసిగొలిపితేశాన! ఈ ఎక్కువోడు దొడు దియ్యడానికి, మరేటక్కర్నేదు.

చిన్నా : ఒవుడ్రా బేపి? నువ్వా నానా? ఒవుకు బెల్లముక్కెడితే ఆడిసెప్పు ల్నాకుతావు. దూదూ అంటే ఒస్తవు. సీఫో అంటే పోతవు. బేపెవరు, నువ్వా నానా?

చంద్ర : చిన్నా! నడవలోకి ఫో, రాజయ్యా! వాడితో మాట్లాడకు.

చిన్నా : మరి నూడండా డేటంట్నాడో?

చంద్ర : నువ్వెళ్లు. మాట్లాడకు.

చిన్నా : (నడవలోకి వెళిపోయేను)

రాజా : తోకముడుసు కక్కడ పడుండు!

చిన్నా : (లో నుంచి) సత్తివుంటే నడవలోకి రా.

చంద్ర : రాజారావ్! వాడితో మాట్లాడకు.

రాజ : ఆడిక్కీ నాకూ నేస్తవేఁనండి, ఆస్సికాని కలా అనుకోంతాం.

చంద్ర : ఇక్కడేం హాస్యాలక్కర్లేదు.

సోమ : ఒరే అబ్బీ, అలా రెప రెప లాడుతున్నావు. నీ కేవిఁట్రా పనీ?

రాజా : నా పనా?

సోమ : ఆఁ నీ పనే!

రాజా : యీపులు సాపుసెయ్యడఁవండి నా పని. కొత్తపేట రాజిగాడి పేర్నెప్తే పిట్ట ల్నీళ్లు తాగవండి, రగిడీసులు బోంచెయ్యరండి. పోలీసోళ్లకి పడక లుండవండి.

సోమ : అంత గొప్పవాడివేఁ విట్నువ్వు?

రాజా : వూరి మొత్తింమీ్మదర గొప్పోళ్లిందర మంది రికీ నాను యెనకదన్నండి. మరింక మొన్నెక్క మీరే యేసుకోండి.

సోమ : తుప్పతలా బీడీముక్కా నువ్వా నువ్వే నేవిఁటి గొప్పోళ్లిందరికీ మద్దత్తిచ్చే వాడివి?!

రాజా : కాదేటండి? మరుప్పుడు నాను మీకు మద్దత్తుకి రానేదా? యిప్పుడు నాను మీకు దన్నా? మీరొన్నాకు దన్నా? సెప్పండి... మాట్లాడ్రేం?

చిన్నా : (లో నుంచి) ఒవుడొబ్బిస్తే ఆడికే దన్నురా నువ్వూ, దొంగనాకొడక!

రాజా : నువ్వోల్లకోరా. తోక తెంపేగల్ను.

సోమ : ఒరే శేఖరంబాబూ! వీడికి తుప్పతల మూరడూ, నీలుగు తెగబారెడూన్రా! వీణ్నెందుకు లాక్కొచ్చేవ్?!

చంద్ర : మీరు నన్నిప్పుడేం చిరాకు పెట్టకండి. ఓయ్-రాజారావా, రాజయ్యా నీ పేరు?- నువ్వేం మాట్లాడకు (అని పచారుచేస్తూ మధ్య మధ్య వీధిగుమ్మం దగ్గరకీ, కిటికీదగ్గరకీ వెళ్లి చూస్తున్నాడు.)

రాజా : నీలుగు తెగబారెడంటే గ్యాపకఁ వొచ్చిందండి. ఓ పాలి డియాస్పీబాబు రమ్మని కబురెట్టినాడండి.

సోమ : డియస్పీవా?

రాజా : ఆఁ డియాస్పీ బాబండి, రమ్మని కబురెట్టేడండి

సోమ : ఎందుకూ? జెయిల్లో వెయ్యడానికా?

రాజా : సెప్పిందాక ఉండ్రేం?

సోమ : చెప్పు చెప్పు.

రాజా : కబురెడితే ఎల్లేనండి. డియాస్పీబాబలా కూకడన్నాడండి. నన్నిలా కూకడ బెట్టినాడండి.

సోమ : అర్ధసింహాసనఁ వివ్వలేదూ?!

రాజా : సత్తెప్రెమానంగ కూకడ బెట్నాడండి. కాని ప్లీబులూ, ఏడ్లూ, సబినస్పెట్టర్లూ అవితే మనమీద కలబడి పోతారు గాని దొరదగ్గర కెత్తే, కూకడబెడతాడండి.

సోమ : నెత్తెక్కించుకోడూ?

రాజా : కూకడ బెట్టేటన్నాడంటే "ఏరారాజిగా" అన్నాడండి, "యేంబాబు కబురెట్టి రమ్మన్నావూ" అన్ననండి, అంటే ఆ బాబన్నాడూ: "యేరా రాజిగా సబినాసుపెట్టర్

మీాదే తిరగబడ్డావంట. అంతనీలుగ్గుంకేటి? ఇకముందల చమాపన్చెప్పుకొని తిన్నగుంటావా, లేకపోతే ఏడేళ్ళు మోసేమంటావా?" అని గుడ్డెర్రజేసి బల్ల గుద్ది కేకవేసి అడిగినాడండి.

సోమ : ఎవడైనా నిన్నలాగే అడుగుతాడు.

చంద్ర : ఏమిటి సోమనాథంగారూ! వాడితో మీ హాస్యం?

సోమ : మనవాణ్ని ఏడేళ్ళపాటు మోసేస్తానన్నాట్ట ఎవడ్రా అన్నాడు?

రాజా : డియాస్పీ దొరండి.

సోమ : బాగానే ఉందన్నాను. మనవాడు రవణయ్యకి మూడోకొడుగ్గా ఉండదగ్గవాడు.

రాజా : మీాగోలాగ్గేయండి. ఇదినండి. డియాస్పీబాబంగా అనేసరికి నాను బల్లమీాదర్నించి నెగిసిపోనానండి. నెగిసిపోయిఏటన్నానంటే: "బాబూ! నాది సిన్న మనివి. అదిన్నాక మీాకేటితోస్తే అచ్చేయండి" అన్ననండి. "ఏటది? సెప్పు" అన్నడండి డియాస్పీబాబు, అంటే అప్పుడు సెప్పేనండి "బాబూ! బెజాణ్నించి, సెన్నాపట్టన్నించి ముఫ్పొద్దులా అన్ని గాడీల్లోంచీ జేబుకొటుగాళ్ళు కుటాంబాల్తో దిగేసి, వూరంతా అక్కరమించేసి, మనూరి కొటుగాళ్ళ కడుపులు కొట్టేస్తన్నారూ! బోపాలన్నించి, పాకీస్తానన్నించి ఆడాళ్లొ కొడాళ్ళు, మొగాళ్ళకి మొగాళ్ళు గాగరాల్లో, లంగాల్లో దాసుకొచ్చి ఈశలకీశెల్నల్లమందమ్మేసి ఏలకేలు దోసుకుపోతన్నారూ; సవుంద్ర పొడ్డండ, ఏటిగట్లంట, తోట్లండ, దొడ్లంట, ఇళ్లంట యీాడూ ఆడూ అనకండా అన్నిజాతులోళ్ళూ బట్టీలెట్టేసి పీపాలకి పీపాలు సారాదించేసి పబ్లీగ్గా అమ్మకు మోతు బర్లయి పోతన్నారూ! ఆడాళ్లు-అంటే ఎవురు? కూలికొచ్చి బతకలేనోళ్లనీ, అడుక్కుబతికేవోళ్లనీ, సెడిపోయి లేచొచ్చి నోళ్లనీ, ఏటెరగనోళ్లనీ—ఆడాళ్లందర మందిర్నీ పోగుజేసి ముండల కంపెనీలెట్టుకొని ఈణ్ని ఆణ్ని ఓళ్లొంచి దిగినోణ్ని పిల్సుకొచ్చి, పీకలమొయ్యా సారా పట్టించేసి, పక్కలోకి ముండల్ని తార్సిఆకర్నజోబీల్తడిపేసి బతికే డాఫరునాయెదవలంతా సూట్లూబుష్కోట్లూ యేస్కొని సోకు జమాయించి గలగల్లాడతా గల్లాపెట్టెల్లా సప్పుడుజేస్తా తిరగతన్నారూ!" అని నానసేసరికి డియాస్పీ బాబేటన్నాడంటే...

చంద్ర : ఒరే రాజయా! నీ వాగుడు కట్టిపెట్టు.

రాజా : సరిగ్గామాటే అన్నడండి డియాస్పీబాబు, అంటే అప్పుడు నానేటి సెప్పేనంటే "బాబూ! తమరలా టోళ్లందర మందిర్నీ ఒగ్గేసి నామీాదా సూపిస్తారు తమరి పెటావ్వుం? అలాగైతే, తమరి కన్నేయం కాదన్తోస్తే—సిత్తం—యేడేళ్లు కాదు, పది సంవచ్చరాల్తోయించేయండి. తమరిపేర్జెప్పుకొని జెయిల్లో సంతోషంతో కూకడుంటానూ" అన్ననండి.

చంద్ర : రాజయ్యా ఊరుకుంటావా ఊరుకోవా? మన పనికి వేళవుతోంది. (దూరాన్న మోటారు సైకిలు చప్పుడు) అదిగో వస్తున్నట్టున్నాడు, సోమనాథంగారూ! లెండి.

సోమ : (కుర్చీలోంచి లేచి పంచె ఎగ్గడుతూ) మేం కూడా నడవలోకి పోవాంమరి!

చంద్ర : వేగిర వెళ్లండి, రాజయ్యా నువ్వూ వెళ్లు.

రాజా : అక్కడ కూసొని ఏటి సెయ్యాలండి.

చంద్ర : పొద్దుట చెప్పేకదూ? అక్కడ కూర్చో, పిలవగానే రా. అల్లరేకుండా చూడు.

సోమ : ఏం చెయ్యాలో చెప్తా నిలారారా (అని నడుంకి తువ్వాలు కట్టుకొంటూ నడవలోకి వెళ్లేడు సోమనాథం. అతనివెనక రాజారావు కూడా వెళ్లేడు. ఇంతట్లో "హ...లో" అంటూ ప్రవేశించేడు మోహను. ఈవెనింగ్ డ్రెస్‌లో ఉన్నాడు. హుషార్ గానే ఉన్నాడు.)

చంద్ర : హలో రా, అలా కూర్చో.

మోహ : (వాలు కుర్చీలో కూర్చొంటూ) వాట్ బ్రదర్! నేనొక్కణ్నే కనిపిస్తున్నాను!

చంద్ర : (రిస్టువాచీ చూసుకొని) అవునింకా ఎవరూ రాలేదు.

మోహ : విందు సన్నాహ మేమియు కానరాదేమి?

చంద్ర : కనిపించడం లేదా?

మోహ : ఓ సిగరెట్టిలా ఇచ్చుకో, చిరుతిండి వాసన ఇచ్చట వేయ నేలేదేమి?

చంద్ర : (సిగరెట్ ప్యాకెట్ విసిరి) ఇంకా ఏదీ.

మోహ : (సిగరెట్ తీస్తూ) ఏ గెస్టూ ఇంకా రాలేదేం?

చంద్ర : నువ్వొచ్చేవు చాల్దూ?

మోహ : విందుకి వనితారత్నంబులు వత్తురా!

చంద్ర : రారు.

మోహ : హా! రారా?

చంద్ర : సిల్లీగా మాట్లాడకోరే.

మోహ : విందు లేనూ లేక, వనిత రానూరాకపోతే మర్నన్నెందుకురా రమ్మన్నావ్?

చంద్ర : ఒరే మోహన్! విందు ముందా, వివాహం ముందా? చెప్పు.

మోహ : (సిగరెట్ అంటించి పొగవదుల్తూ) ముందే విందు, విందేముందు.

చంద్ర : అటుంచిటు తిరగేస్తున్నేను.

మోహ : విందుముందే అన్నా ముందే విందన్నా ఒకటే, ఎటుంచెటు తిరగేసినా అంతే.

చంద్ర : అదికాదురా బ్రదర్! ముందు వివాహము, తదుపరివిందు. అదీ నా కార్యక్రమం.

మోహ : అంటే?

చంద్ర : అంటే ఏవిఁటనా?

మోహ : అంటే ఏవిఁటనే?

చంద్ర : ఏంలేదు. "యువర్ గేమ్ ఈజ్ అప్," అంటే అర్థంతెలుసా?

మోహ : తెలుసు.

చంద్ర : ఏఁవిఁటి?

మోహ : "నీ ఆటింతటితో కట్టు," అని దానర్థం.

చంద్ర : అది చెప్పడానికే నిన్నిక్కడికి పిల్చేను.

మోహ : అంటే?

చంద్ర : అర్థంకాలేదా?

మోహ : విడమర్చి చెప్పుము, అర్థమగును.

చంద్ర : ఏంలేదు. ఇవాళ నీ వెటకారఁవంతా ఒదలగొట్టే దల్చుకున్నాను.

మోహ : (కొంచెం సీరియస్‌గా) ఏవిఁట్రాభాయ్ సంగతీ?

చంద్ర : నే చెప్పిందే సంగతి, ఇంకేంలేదు.

మోహ : నీ మనసులో ఏదో ఉంది. అదేఁవిఁటో సూటిగా చెప్పెయ్.

చంద్ర : చెప్పేమంటావా?

మోహ : చెప్పే.

చంద్ర : నీకు పెళ్లిచేసి విందు చేద్దాఁవఁని పిల్చేను. అదీ సంగతి.

మోహ : నీ వరసనాకేవీఁ బోధపడ్డం లేదురా బ్రదర్;

చంద్ర : బోధపడ్డం లేదా?

మోహ : లేదు.

చంద్ర : ఇంకా స్పష్టంగా చెప్పాలా?

మోహ : చెప్పుము.

చంద్ర : చెప్పాలా?

మోహ : చెప్పు.

చంద్ర : చెప్పమంటావా?

మోహ : గుడ్ గాడ్! ఎన్నిసార్లడుగుతావ్! వేగిరం చెప్పు.

చంద్ర : మరేంలేదు. కామేశ్వరనే అమ్మాయి నీకు తెలుసుకదూ?!

మోహ : (కుర్చీలోంచి నెమ్మదిగా లేచి సిగరెట్టు పీల్చి పొగవదిలి) క్యాభాయ్! ఇదేం సరసవాఁ లేక విరసవాఁ?

చంద్ర : సరసవోఁ విరసవోఁ నువ్వే తేల్చాలి.

మోహ : నీ వ్యవహారం నాకేం అర్థం కావటంలేదు.

చంద్ర : (తిన్నగావెళ్ళి వీధి తలుపు గడియవేసి అక్కడే నిల్చొని) ఒరే అబ్బాయ్! నే చెప్పేది సరిగ్గా విను.

మోహ : ఏఁవిఁటి? (అంటూ కొంచెం దగ్గరగా వచ్చేడు)

చంద్ర : ఇప్పుడు నువ్వింక తప్పించుకొందికి వీల్లేదు.

మోహ : అంటే ఏవిఁట్నీ అభిప్రాయం?

చంద్ర : అభిప్రాయం గిభిప్రాయం అలా ఒదిలెయ్. నే నొకటడుగుతాను. సమాధానం చెప్పు.

మోహ : (మాట్లాడలేదు. సిగరెట్టు తొందర తొందరగా పీలుస్తున్నాడు)

చంద్ర : చెప్తావా చెప్పవా?

మోహ : ఏఁవిఁటన్నీ ప్రశ్న ?

చంద్ర : కావేశ్వర్ని పెళ్లాడతావా? పెళ్లాడవా?

మోహ : ఏఁవిఁటీ నాటకం ?

చంద్ర : నాటకం గీటకం జాన్తానై. ఆ పిల్లని పెళ్ళాడతావా? పెళ్ళాడవా ?

మోహ : జవాబు చెప్పాలా ?

చంద్ర : చెప్పవలసిందే.

మోహ : అయితే చెప్తా విను.

చంద్ర : చెప్పు

మోహ : దాన్నయి పెళ్ళాణ్ను. పెళ్ళాణ్ను.

చంద్ర : అభిప్రాయం మార్చుకోవా ?

మోహ : మార్చుకోను.

చంద్ర : మర్యాదాగా అడిగేను. మార్చుకోనన్నావు. సరే. కాని నీకిష్టం వున్నా లేకపోయినా ఆ పిల్లని పెళ్ళాడి తీరవలసిందే.

మోహ : నాతో తమాషా ఏఁవిఁట్రా?

చంద్ర : తమాషా ఏంకాదిది. తమాషా తీర్చేస్తారని చెప్తున్నాను.

మోహ : అంటే ఏంచేస్తావ్?

చంద్ర : పెళ్లాడ్డానికి బుద్ధిగా ఒప్పుకున్నావా సరే సరి...

మోహ : లేకపోతే?

చంద్ర : లేకపోతే బుర్రవాయగొట్టి మరీ ఒప్పిస్తారు.

మోహ : (నవ్వబోతూ) హాస్యానికేంగాని రారా అబ్బాయ్! ఇలారా. (అని సిగరెట్టుపీకె పారేసి) ఏదీ? మరో సిగరెట్టిచ్చుకో.

చంద్ర : ఇదేం హాస్యంకాదు. నేనన్నమాట అక్షరాలా జరిపించితీరుతాను.

మోహ : ఒస్ అలా అయితే జరిపించేరా! నువ్వెవర్ని తీసుకొస్తే దాన్నే పెళ్లాడేస్తాను.అసలింతకీ పెళ్ళికూతురేదీ?

చంద్ర : సమయానికొస్తుంది.

మోహ : వెతుక్కోమంటావా? (అంటూ వెనక గది వైపు నడిచేడు. అట్నుంచి ద్వారం తెరిచుంటే వెనగ్గదిలోంచి తోట్లోకి వెళిపోవొచ్చు.)

చంద్ర : ఆగరా అబ్బాయ్! ఆగు!

(అని వాడిదగ్గరికి వెళ్లేడు. నడవగుమ్మం దగ్గర ఉన్నవాడు శేఖరం అక్కడికి వెళ్లిగానే తటాలున వెనక్కి పరిగెట్టి వీధి తలుపుకి గడియతీస్తున్నాడు. శేఖరం మళ్ళీ వెనక్కొచ్చి వాణ్ని రెక్కపట్టుకు వెనక్కిలాగేసి "రారా చిన్నా" అని కేక వేశాడు.)

మోహ : (చెయ్యి విదిలించుకోబోతూ) ఏఁవిఁట్ చేస్తావ్?

చంద్ర : చూడు చూడు అలా చూడు.

(పంచె ఎగ్గట్టి, నడుంకి తువ్వాలు చుట్టుకొని ఓకర్ర పుచ్చుకొని తిన్నగా వీధి గుమ్మం దగ్గరకి వెళ్ళి నిల్చున్నాడు. సోమనాథం. ఓ కర్రపుచ్చుకొని నడవగుమ్మం దగ్గరే నిల్చున్నాడు. చిన్నారావు. "నోరిప్పేవా జాగరత్త" అంటూ ఝామ్మనొచ్చి మోహన్ వెనక్కి వెళ్లి నిల్చొని వాడి రెండుచేతులూ వెనక్కిలాగి పట్టుకున్నాడు రాజారావు)

చంద్ర : తమాషాకాదని చెప్పలేదురా అబ్బాయ్!

మోహ : ట్రెచరస్ స్కౌండ్రల్వి నువ్వు.

సోమ : దొంగ గాడిద కొడుకివి నువ్వు.

చంద్ర : మీరేం మాట్లాడకండి సోమనాథంగారూ! ఏఁరాఅబ్బాయ్ ఇప్పుడైనా ఒప్పుకుంటావా?

మోహ : విశ్వాసఘాతకుడివి. నీతో మాట్లాణ్ను.

చంద్ర : ఒప్పుకుంటావా ఒప్పుకోవా? మాట్లాడకపోతే సంజ్ఞలుచేసి చెప్పు.

మోహ : నే చెప్పను.

చంద్ర : అయిందేదో అవుతుందయితే.

మోహ : బలవంతం పెళ్లిళ్ళు చెల్లవు.

సోమ : చెల్లవూ గిల్లవూ అంటే తంతాను. మాయ ముండాకొడకా?

మోహ : ఒంటిగాణ్ని చేసి ఏవైఁనా అంటారు.

చంద్ర : ఇప్పుడుకూడా ఒప్పుకోననే అంటావు!

మోహ : ఒప్పుకోను.

[మోహన్ చేతులు వదిలేసి వాడి మెడ జివ్వలు చటాల్న పట్టుకున్నాడు రాజారావు.]

మోహ : అబ్బా! ఒదిలీ ఒదిలీ!

చంద్ర : ఒదిలేరా అబ్బీ వాణ్నొదిలీ, వాడొప్పుకో గానే ఒదిలీ!

రాజా : ఒప్పుకుంటవా ఒప్పుకోవా?

మోహ : ఒప్పుకుంటా నొదిలీ ఒదిలీ (అని చేతుల్తో విడిపించుకోబోతున్నాడు మోహను.)

చంద్ర : ఒదిలేరా రాజయ్యా! (మోహన్ని విడిచి పెట్టేడు రాజారావు.)

[మెడ తడుముకొంటూ రాజారావైపు తిరిగేడు.]

మోహ : రాజిగా!!

రాజా : ఎవురెవురూ!

మోహ : రాజిగా! నువ్వా?!!

రాజా : (ఓ అడుగు వెనక్కి వేసి) బాబూ తఁవఁరా?!

మోహ : నే నేన్రా నే నే! అప్పుడు చీకట్లో చూసేవు. నేనే నే నే! (అని జేబులోంచి పర్సు గభాల్న తీసేడు. దాన్ని అందుకున్నాడు రాజారావు. అంతా తృటికాలంలో జరిగి పోయింది.)

చంద్ర : ఏఁవిఁట్రా రాజయ్యా! ఏఁవిఁటిదంతాను?

మోహ : థాంగ్గాడ్! థాంగ్గాడ్! (అనుకొంటూ శేఖరాన్ని చూసి చటాల్న రాజారావ్వెనక్కి వెళ్ళి నిల్చొని) వాడేరా. రాజీ! వాడే! మా నౌఖరీ వెధవ! మా సొమ్ము తిని మామీ త్తిరగ బడుతున్నాడు. వాడికీ ఆ ముండకీ ఇలాకా! వాణ్ని రానివ్వకు.

[మోహన్ చెయ్యిజాచి శేఖరం వెనక్కి చూపిస్తున్నాడు. శేఖరం వెనక్కి చూసేడు. నడవగుమ్మంలో ఎప్పుడొచ్చి నిల్చుందో కామేశ్వరి నిల్చొంది.]

చంద్ర : } ఆ పిల్ల నేవైఁనా అంటే చంపేస్తాను.
సోమ : } దగుల్బాజీ తొత్తుకొడుకా!!

[అని శేఖరం సోమనాధమూ ఒక్కసారే కేకేసేరు. శేఖరం ముందుకి అడుగు వేసేడు. ఆ సమయంలోనే కర్రఎత్తి వస్తోన్న సోమ నాధానికి వెనగ్గా గబుక్కనవెళ్లి కర్ర లాగి పారేసి అతన్ని బలంగాతోసి కింద పడ దోసేడు మోహను.]

రాజా : అడుగేస్తే మెడకాయ తెగుద్ది (అని ఎక్కణ్నించితీసేడో తటాల్న కైజారుతీసి శేఖరాని కడ్డుగా నిల్చున్నాడు రాజారావు. సోమ నాథం ముణుక్కి దెబ్బతగిలినట్టుగా ఉంది. చిన్నారావు నడవలోకి చల్లగా జారిపోయి నట్టుగా శేఖరం గమనించలేదప్పుడు. మోహను వికవిక నవ్వేడు.)

మోహన్: చంపేస్తావేం? ఏదీ చంపమ్మా చూస్తాను. చంపు (అంటూ కొంచెం ముందరకొచ్చేడు. శేఖరం కదిలేడు.)

రాజా : మేకని బలేసినట్టు బలేసేస్తాను. కదలకు. ఇంట్నావా? (అని శేఖరంతో అనిమోహన్తో) బాబూ తఁవఁరింక జారేయండి. ఊఁ జారే యండి.

మోహ : ఉండ్రా రాజిగా! ఏం భామామణీ నీకు పెళ్లి కావాలా? అదుగో (అని శేఖరాన్ని చూపిస్తూ) మంచిమొగుణ్ని కు, మంచి మొగుడు. అదుగోన్రా శేఖర్! ముస్తా బయొచ్చింది పెళ్లికూతురు. పెళ్లిచేసుకొం టివా చక్కటి ఛాన్సు. చెట్టూ కాయా రెండూ నీవే! ఫర్నిష్డ్‌హవుస్! బలేబేరం! ఎక్సలెంట్ ఛాన్స!

చంద్ర : బ్లడీస్కౌండ్రల్స! [అంటూ శేఖరం ముందుకి నడిచేడు. రాజారావు అతన్నడ్డు కున్నాడు. వాడూ అతనూ కలబడ్డారు. అంతవరకూ బాధనటిస్తూ కూర్చున్న సోమ నాథం వాడి కాళ్లుపట్టుకొని లాగీసేడు. శేఖరం వాడూ తిరగబడ్డారు. ఆసమయంలో వీధివైపు కిటికీలోంచి ఎవరైనా ఇదంతా చూస్తున్నారేమో నన్నది ఎవరు చూడలేదు. అంతకుముందు సోమనాథం చేతిలోంచి లాగి పారేసిన కర్రని నేలమీంచి తీయబోయేడు మోహను. సోమనాథం కూర్చొనే అడ్డు కున్నాడు.]

రాజా : (శేఖరంతో పెనగులాడుతూ) తమ రెళ్లి పోండి బాబూ తఁవఁర్ దాటేయండి.

[ఆ మాటవిని వెంటనే కర్రవదిలేసి పోయి మోహను వలుపు తెరిచేడు. వీధిలోకి వెళ్లి పోను కూడాను. అంతలో అట్నుంచి

అడ్డొచ్చి వాణ్ణి తోసేసి మీదపడి పట్టుకున్నాడు సోమనాథంకుమారుడు జగ్గన్న. శేఖరం సోమనాథవూఁ రాజారావుని లొంగదీసేరు. శేఖరం లేచి నిల్చున్నాడు. రాజారావు మీద కూర్చున్నాడు సోమనాథం. వాడితల నేలకేసి కొడుతున్నాడు.)

చంద్ర : (మోహన్ని పట్టుకున్న జగ్గన్నని చూసి) శాబాష్ జగ్గన్నా! అలాగే పట్టుకో వాణ్ణి! అలాగే పట్టుకో (అంటూ వెళ్లి వీధితలుపు లేసేసేడు. కత్తెరపట్టు వేసి పట్టుకున్నాడు మోహన్ని జగ్గన్న.)

మోహ : హెల్ప్! హెల్ప్!

చంద్ర : నోరెత్తేవా, చంపేస్తాను, చంపీడవేఁ తెలిసిందా?

మోహ : (పెనుగులాడేడు. లాభం లేకపోయింది.)

చంద్ర : కేకలేస్తే పీకనొక్కు జగ్గన్నా.

(జగ్గన్న వాణ్ణి మరీ బిగించి పట్టుకున్నాడు. మోహన్‌కి అయాసంగా ఉన్నట్టుంది. శేఖరం కామేశ్వరివైపు చూచేసరికి ఆమె మేజాని ఓచేత్తో పట్టుకుని రెండో చెయ్యి నెత్తిమీద పెట్టుకుని జోగుతోంది.)

చంద్ర : కావేఁశ్వరీ.

కామే : (పలకలేదు. జోగుతోంది.)

చంద్ర : (వాలుకుర్చీ నామెదగ్గర గాలాగి) కావేఁశ్వరీ ఇలా ఇందులో కూర్చో. ఊఁ కూర్చో.

కామే : (కుర్చీలో కూలబడి కూర్చుంది.)

[శేఖరం "చిన్నా చిన్నా" అని కేక వేసేడు. వాడు పలకలేదు. నడవలోకి వెళ్ళి చూస్తే వాడు ఓమూల నక్కి కూర్చున్నాడు. "ఇక్కడ్రా కూర్చున్నావు? రా ఇలారా" అని వాణ్ణి గదిలోకి లాక్కొచ్చేడు.]

చిన్నా : ఒద్దుబాబూ! రాజిగాడు రగిడీసుముండా కొడుకుబాబు. సంపేస్తడు బాబొద్దుబాబూ. (సోమనాథం అంతసేపూ రాజిగాణ్ని ఏదో తిడుతూ మధ్యమధ్య కొడుతూ నేవున్నాడు. "ఒగ్గేయండి బాబొగ్గేయండ"ని అరుస్తూనే ఉన్నాడు రాజిగాడు.)

చంద్ర : ఎందుకురా నీకంత భయం? చూడు మీరాజిగాడెక్కడున్నాడో చూడు. వాడు చస్తాంటే నిన్నిప్పుడేం చంపగల్డు?

చిన్నా : (కళ్ళు నులుముకొని చూసి) కొత్తపేట రగిడీసు రాజిగాడే?!

చంద్ర : కొత్తపేట రగిడీసు రాజిగాడే,

సోమ : ఏఁరా అడుగేస్తే మెడకాయ తెగుద్దా? తెగుద్దా? ఏం చెప్పవేం!

రాజా : తెగదు తెగదొగ్గేయణ్నన్న!

సోమ : ఒగ్గేయాల్రా బాబూ నిన్నొగ్గేయాలా?

చిన్నా : ఒగ్గీకండిబాబు అణ్నాగ్గేకండి (అని తుర్రుమని మళ్లీ వెనకవరాండాలోకి పరిగెట్టేడు)

సోమ : ప్రాణంతీసి మరీ ఒగ్గేస్తాను.

చంద్ర : జగ్గన్నా!

సోమ : జగ్గన్నా?! ఏడీ (అని చూసి) ఎప్పుడొచ్చేవురా?

చంద్ర : మీకు ఒంటిమీా త్తెలివుంటేనా? జగ్గన్నా! వాణ్నొదిలీ.

చిన్నా : (ప్రవేశించి) బాబూ తాడుతాడుతాడిదిగో.

సోమ : తాడక్కర్లేదురా (అంటూ చేతులు దులుపుకొంటూ లేచేడు. నేలమీదపడ్డ కత్తితీసి పట్టుకున్నాడు.)

జగ్గ : ఇతన్నొదిలీమంటారా?

చంద్ర : ఒదిలెయ్!

సోమ : ఒరేయ్! మీఇద్దర్లోనూ ఎవడైనా సరే ఊఁ అన్నారా సఫాచేసేస్తాను. వింటున్నారగాడిదకొడకల్లారా!

రాజా : (మెల్లిగా కూర్చొంటూ) యింటున్నాం!

సోమ : పాడిచేసి పెరట్లో కప్పెట్టేస్తాను. ఆపైన ఏవఁట్రానీయండి!

చంద్ర : (ఒగర్చుకొంటూ నిల్చున్న మోహన్ని ఉద్దేశించి) ఏవిఁరా! ఇప్పుణ్ణువ్వు ఒప్పుకున్నట్టేనా?

మోహ : అయాసంగా ఉంది. మాట్లాళ్లేను. (అంటూ వెళ్ళి స్టూల్ మీద కూర్చున్నాడు)

చంద్ర : కావేఁశ్వర్ని పెళ్ళాడతావా?

మోహ : అయాసంగా ఉంది! పెళ్ళాళ్ళేను.

సోమ : ఆ ఫకీరువెధవ నడిగేదేమిట్రా! ఎవడికోసం పీటలమీదకూచుంటాడు! కూచోనని అనమను వాణ్ని! ఊఁ అనమను!

చంద్ర : ఆయాసం తీర్చుకోనివ్వండి వాణ్ని.

చిన్నా : బాబూ! ఈణ్ని తాడేసి కట్టాలా? కట్టొద్దా

సోమ : కట్లుకట్టేసి కాటికి మోసుకుపో వెధవని! [చిన్నా తాడువేసి రాజారావు జెబ్బల మీంచి మూడుమట్లు తిప్పేడు. జగ్గన్న ఏఁ వీఁ ఎరగనట్టు ఎటోమాస్తు కిటికీ దగ్గర నిల్చున్నాడు]

రాజా : ఒగ్గేరా సినయ్‌మావాఁ నన్ను పోనీరా!

చంద్ర : సోమనాథంగారూ!

చిన్నా : నాకేటి తెల్దా బాబునమస.

చంద్ర : చిన్నా! నువ్వల్లరి చెయ్యకు, సోమనాథం గారూ! ఏడుగంటల కనుకున్నాం మనం ముహూర్తం. ఇంక మనకాట్టే టైమ్ లేదు. పెళ్ళి ముహూర్తం దగ్గిరవుతూంది.

సోమ : ఉండ్రా! పెళ్ళి ముహూర్తంకాదు వీళ్ళ చావుముహూర్తం చేసెయ్యాలనుంది నాకు (అని మోహన్నీ రాజారావునీ చూపిస్తూ అన్నాడు)

చంద్ర : సోమనాథంగారూ! ఇటు చూడండి.

సోమ : ఎటు చూడ్డం?

చంద్ర : ఇటు (అంటూ కామేశ్వర్ని చూపించేను)

సోమ : ఏఁ వేఁ అమ్మడూ! ఇక్కడే వున్నావుటే చూణ్నే లేదు.

కామే : (మాట్లాడలేదు చూళ్ళేదు)

చంద్ర : ఈపిల్లే ప్రహ్లాదుడనుకొని మీ నరసింహావతారం వింకచాలించండి. ముహూర్తం దగ్గిరవుతూంది. మరింక మీరు బ్రాహ్మణ్యం స్వీకరించాలి.

సోమ : అలాక్కానీ అలాగేకాని (అని ఓ కుర్చీ దగ్గరకి నడుస్తూ కొంచెం కుంటేడు) మోకాలికి దెబ్బతగిలిందిరా! అమ్మా! ఈ పెళ్ళికొడుకు వెధవే తోసీసేడు. వెనకనుంచి తోసీసేడు. పులుసులో కెమికలుంచకూడదురా దొంగవెధవకి (అంటూ కుర్చీలో కూర్చున్నాడు. కైజారు జేబులో పెట్టుకున్నాడు)

చంద్ర : మీ ఆశీర్వచనాలు చాలించండి! కాని ఒరే చిన్నా!

చిన్నా : ఏం బాబూ?

చంద్ర : ఆశీర్వచనమంటే జ్ఞాపకమొచ్చింది. అర్జంటుగా సైకి లేసుకొనెళ్ళి రమణయ్యగార్నిక్కడికి రమ్మను.

సోమ : ఇక్కడకా తండ్రి వెధవకూడా ఎందుకూ?

చంద్ర : మీరూరుకోండి. చిన్నా నువ్వెళ్లు. వేగిరం రమ్మన్చెప్పు.

చిన్నా : ఎందుకంటే ఏటన్చెప్పాల?

సోమ : అడుగో వాడికి శ్రాద్ధం పెట్టాలి. వేగిరమ్మను.

చంద్ర : మీరుండండి సోమనాథంగారూ! (అని అతన్నని. చిన్నాతో) వెళ్ళా చిన్నా! వెళ్ళి నేనమ్మంటున్నానన్చెప్పు. ఎందుకంటే ఆశీర్వదించాల్ట, రమ్మంటున్నాడు శేఖరమన్చెప్పు.

చిన్నా : అచ్చింత లెయ్యాలంట. బేగి పారమ్మన్నారన్నె ప్తనండి.

చంద్ర : అలాగే చెప్పు! వేగిరం వెళ్ళు.

చిన్నా : సిటికలో రానా?! (అంటూ వీధి తలుపు తెరుచుకొని వెళ్ళేడు. జగ్గన్న మళ్ళీ తలుపు లేసీసేడు)

చంద్ర : సోమనాథంగారూ.

సోమ : అక్షింతలొంహటా వీడికి? నెత్తిమీద రాళ్ళెత్తెయ్యాలి ఫకీరు వెధవకి!

చంద్ర : మీతో గట్టి చిక్కొచ్చిందండీ.

సోమ : చిక్కేమిట్రా నీనెత్తీ!

చంద్ర : మీ మాట్లింక చాలించండి. టైమవుతూంది, మీరింక తయారుకావాలని చెప్తే వినిపించుకోరు. అమ్మా యిక్కడే వుందన్చెప్పినా ఆ పంచాంగం చదవడం మాన్రు, మిమ్మల్నేవండం?

సోమ : నోరు మూసుక్కూచుంటూ లేరా బాబూ! నీ అజమాయిషీ లావయిపోయింది!

చంద్ర : మరింక తయారీకండి.

సోమ : తయారీదేనికి?

చంద్ర : దేనికా? ఈమె సిద్ధంగా ఉంది. వాడు సిద్ధంగా ఉన్నాడు. మీరే సిద్ధంగా లేరు.

సోమ : నీ అమ్మకడుపు బంగారంకానూ! దేనికో చెప్పరా?

చంద్ర : మనం ఇక్కడ ఇప్పుడేవిఁటి చెయ్యాలో చెప్పండి?

సోమ : ఏవిఁటి చెయ్యాలి? పెళ్లి.

చంద్ర : "పురోహితుడూ అక్కర్లేదు. గిరోహితుడూ అక్కర్లేదు. అంతా నేనే చేసేస్తా" నన్నారు. ఇప్పుడేవిఁ చెయ్యాలో చెప్పండి

సోమ : అవున్రోవ్! మర్చిపోయేను.

చంద్ర : ఇప్పుడు జ్ఞాపకవొచ్చిందికదా! మర్లెండి.

సోమ : వాడెవడో రాజమండ్రీవాడు "పెళ్ళిపుస్తకఁ" వొహటి అచ్చేయించేడ్రా. అద్చూసి చదివేద్దావనుకున్నానూ.

చంద్ర : అలాగే చెయ్యండి. వేగిరం ఏదో కానీయండి.

సోమ : ఆ పుస్తకం తెచ్చినట్టు లేదే. ఏవేఁ అమ్మడూ నే నేవైనా పుస్తకం తెచ్చేనా...

కామే : (ఏదో ఆలోచిస్తున్నట్టుగా కూర్చుంది)

సోమ : అబ్బే! తేలేదురా.

చంద్ర : బలేవారే మీరు! మరైతే ఇప్పుడెలాగ?

సోమ : మరింతసేపూ జ్ఞాపకం చెయ్యవేఁవీఁ నువ్వూ? ఒరే జగ్గన్నా! చప్పునింటికెళ్ళి—గూట్లో ఉంటుంది పచ్చట్ట పుస్తకం—ఇక్కడున్నట్టు పట్రా!

జగ్గ : (కదిలేదు)

సోమ : ఆగాగు! గూట్లో పెట్టేనా? డస్కులో పెట్టేనా?

[అని ఒక్కక్షణం ఆలోచిస్తూ నిల్చున్నాడు. అంతలో కామేశ్వరి లేచి నిల్చొంది.]

కామే : చంద్రశేఖరంగారూ!

[ఆ స్వరంలో వున్న సీరియస్‌నెస్‌కి అంతా ఆమె వైపు తిరిగిచూసేరు]

చంద్ర : ఏం? ఏవిఁటి?

కామే : నాకీ పెళ్ళక్కర్లేదు.

చంద్ర : ఏవిఁటక్కర్లేదూ?

కామే : నాకీ పెళ్ళక్కర్లేదు.

సోమ : ఏఁవిఁటే అమ్మడూ! ఏఁవిఁటక్కర్లేదూ?

కామే : నాకీ పెళ్ళక్కర్లేదు.

సోమ : ఎంచేత? ఏవిఁటొచ్చింది?

చంద్ర : ఏం కావేఁశ్వరీ? ఏఁవిటయింది?

సోమ : ఇప్పుడీ తిక్కమాటలేఁవిఁటి?

కామే : నాకక్కర్లేదు.

చంద్ర : అంతా సిద్ధంచేసీసేం.

సోమ : నీకోసం కుస్తీపట్లు పట్టేం!

చంద్ర : వాణ్ణి ఒప్పించేం.

సోమ : బుర్ర వాయగొట్టి మరీ ఒప్పించేం.

కామే : చంద్రశేఖరంగారూ! నే చెప్తున్నాకదూ! మీరంతా నాకోసం శ్రమ పడ్డారు నిజవేఁ. నేనిప్పుడిలా చెప్తున్నందుకు నన్ను క్షమించండి.

సోమ : పీకలమీదికి తెచ్చుకున్నాక ఇప్పుడీ మాట్లే విఁటే అమ్మడూ! మరి వాణ్ణి పెళ్ళాడకేం చేస్తానంటావ్?

కామే : (నెమ్మదిగా, నిదానంగా) ఈ పెళ్ళి కాపోతే నాకు బతుకు లేకపోలేదు.

సోమ : ఆ వెధవని చేసుకోపోతే బతకలేవా ఏవిఁటి? అదికాదు నేననేది. గ్రంథం ఇంతదాకా ఒచ్చేక ఇప్పుడీ తిక్కపట్టెందుకొచ్చిందీ అని?

చంద్ర : సోవఁనాథంగారూ! నే ననుకొంటూనే ఉన్నాను.

సోమ : ఏవిఁటనుకొంటున్నావు? ఏవఁనుకొంటున్నావో నాతో చెప్పేవేఁసీఁ?

చంద్ర : ఇలా అవుతుందనుకొంటూనే ఉన్నాను.

సోమ : ఎలా అనుకున్నావు?

చంద్ర : మనవాడి ఈ రోజువ్యవహారం కళ్లారా చూసిం తరవాత వాణ్ని పెళ్లాడ్డానికి ఏ ఆడ పిల్లయినా ఎలా ఒప్పుకొంటుంది?

మోహ : (లేచి నిల్చొని) ఆమెకీ ఇష్టంలేదు నాకూ ఇష్టంలేదు. ఇద్దరికీ లేని ఇబ్బంది ఇంతదాకా నీకే ఒచ్చింది కాని.

చంద్ర : పటప్ పటప్.

సోమ : ఒరే నువ్వు నోరెత్తేవంటే ఒళ్లు హూనంచేసేస్తాను. మాటాడక మూల్నలా కూర్చో!

మోహ : ఒంటిగాణ్ని. ఏఁవంటాను?

సోమ : ఏవీఁ అనొద్దనే చెప్తున్నది. నోరుమూసుకలా పడుండు. (జగ్గన్న ముందుకొచ్చి మోహాన్ని భుజంమీద తట్టేడు. మోహను వెనక్కి చూసేడు. స్టూల్ మీద కూర్చో అన్నట్టుగా సంజ్ఞ చేసేడు జగ్గన్న. వెళ్ళి కూర్చున్నాడు మోహను).

కామే : నే నింటికి వెళ్తానండీ!

సోమ : ఇంటి కెళిపోడవేఁ? బాగా ఆలోచించుకొనే మాట్లాడుతున్నావా?

కామే : బాగా ఆలోచించే మాట్లాడుతున్నాను. ఈ విషయంలో నాది తప్పంటే దానికి శిక్షను భవిస్తాను. కళంకఁవేఁదైనా ఉంటే దాని బాధ నేనే భరిస్తాను. నే నింటికి పోతాను (అని రెండడుగులు వేసి) నే నింటికి వెళ్తాను, శేఖరంగారూ! మా అమ్మా నాన్నా నన్నా పాటి దాచుకోగలర నే అనుకుంటున్నాను.

సోమ : దానికేఁవుందే! ఇందులో నీదేం తప్పందని? దగుల్బాజీ వెధవ దగాచేస్తే నీదా తప్పు?

కామే : నా తప్పయితే ఉన్న బాధల్లో ఇదోహటి. ఇందాకా బతుకుతూన్నటుగా నే మా బాధలు మేవేఁ భరించి బతుకుతాం.

సోమ . బాగా చెప్పేవు. ఉన్నమా టొప్పుకోవాలి. ఈరాక్షసి వెధవని కట్టుకొని నువ్వేం సుఖ పడాలని?

కామే : మర్నే వెళ్లొస్తానండీ.

సోమ : వెళ్ళిరామ్మా వెళ్ళిరా.

[కామేశ్వరి వీధి గుమ్మందాకా వెళ్ళి తలుపు తీసింది].

సోమ : ఆగాగు!

[కామేశ్వరి ఆగింది. తలుపుతీసి వెనక్కి తిరిగి చూసింది].

కామే : ఏం?

సోమ : ఈవేళప్పుడు ఒక్కర్తివీ వెళ్తావా?

సోమ : ఫరవాలేదు.

చంద్ర : ఫరవాలేదంటే నే నూరుకోను. ఒరే జగ్గన్నా! వెళ్లు అమ్మడికి సాయంవెళ్లు!

[జగన్నాథం ఉలిక్కిపడ్డాడు].

సోమ : వెర్రిగా అలా చూస్తావేం?

చంద్ర : వెళ్లు జగ్గన్నా నువ్వా వెళ్ళు.

[జగ్గన్న మాట్లాడలేదు. నెమ్మదిగా కదిలేడు కామేశ్వరీ జగ్గన్నా ఇంటికి వెళ్ళేరు]

సోమ : ఇంకీ పీనుగ లెందుకూ ఇక్కడా?

[అంతసేపూ గింజుకుంటూనే ఉన్నాడు రాజారావు. కట్టినతాడుని కేసిఎవరు చూడ నప్పుడు కొంతసడలించుకున్నాడుకూడాను]

రాజా : ఒగ్గిరా బాబూ?

సోమ : రోగం ఒదిలిందా?

రాజా : ఒదిలిపోనాది బాబు.

సోమ : ఇంకా ఏవైఁనా శేషఁవుందా?

రాజా : ఇంకేట్లేదు బాబు. ఒగ్గేయండి బాబూ. పోతాను.

సోమ : వెధవ కట్టిప్పేసి పొమ్మన్రా.

చంద్ర : పొమ్మందాం.

[అని వాడికట్లు విప్పడానికి వెళ్లేడు]

సోమ : నువ్వుండు. వాడే విప్పుతాడు. (అని మోహాన్నిచూసి) ఒరే ఇలా ఒచ్చి వాడి కట్లిప్పు.

[మోహను సురసుర చూసి, వచ్చి రాజారావుకట్లు విప్పేడు. శేఖరం సిగరెట్టు వెలిగించేడు. సోమనాథం చుట్ట ముట్టించేడు.

కట్లు విడీ విడ్డంతో వీలైనంత తొందరగా వెళ్లిపోయేడు రాజారావు].

సోమ : ఎలా వెళిపోయేడో చూడు దొంగవెధవ! (అని మోహాన్ని చూసి) మరింక నువ్వెందుకూ నువ్వూ ఫో. సిగ్గున్న వెధవైతే పోయిచావు.

చంద్ర : గుడ్ బై రా అబ్బాయ్.

[రెండు చేతుల్తోనూ నలిగిన కోటుని సరి చేసుకున్నాడు.]

మోహ : అరె! నా పర్సేదీ!

చంద్ర : పర్సా?

సోమ : ఎవడిపర్సు

మోహ : నా పర్సే! నూటాయాభయ్యుం దండులో.

చంద్ర . నీ పర్సు...ఇందాట్లో రాజిగాడి కిచ్చు కున్నావుకదూ!!

సోమ : అది పట్టుకు వాడుడాయించేడు. మంచి పనయింది. ఫో యఘోరించు.

మోహ : నా పర్సు నా పర్సు! (అంటూ గబగబా వెళ్లిపోయేడు)

సోమ : తన్నుకు చావండి వెధవల్లారా! కట్టకట్టు కేట్లో ఉరకండి.

[అని చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు. బైట మోటారుసైకిలు స్టార్టయిన చప్పుడు]

చంద్ర : సోమనాథంగారూ!

సోమ : ఏమిరా బాబూ!

చంద్ర : వ్యవహారమంతా తారుమారయింది.

సోమ : తారూ లేదు మారూ లేదు. తిన్నగానే అయింది.

చంద్ర : అవున్లెండి మరి. దగాకోరు, దగుల్బాజీ, స్కౌండ్రలూ అని వాణ్ని ఆ పిల్ల యెదట మనమే తిట్టేం. నిజంగా అలాంటి వాడేనని ప్రత్యక్షంగా చూపించేం. మరింకెలా పెళ్ళాడుతుందీ వాణ్ణి!

సోమ : ఛస్తే పెళ్ళాడదు. పెళ్ళాడమన్చెప్పడం మన్ది బుద్ధిపొరపాటు.

[ఇంతలో బైట కారాగినచప్పుడయింది. కొంచెంసేపట్లో రవణయ్య వచ్చేడు. అతని వెనక చిన్నారావొచ్చేడు]

సోమ : రారా రవణయ్ బాబూ రా.

చంద్ర : అలా కూర్చోండి.

రమ : ఏమిటి విశేషం? మావాడొప్పుకున్నట్టేనా ఏమిటి?

సోమ : ముందలా కూర్చోరా!

చంద్ర : మీ వాడొప్పుకున్నాడు.

రమ : ఎలా ఒప్పుకున్నాడు?

సోమ : చెవుల్నులిపి ఒప్పిస్తే ఒప్పుకున్నాడు.

రమ : అయితే ముహూర్తం వగైరా విషయాల గురించి మాట్లాడ్డానికా నన్ను రమ్మన్నట్టు? కుటుంబయ్యకాని ఇక్కడకొస్తున్నాడా?

చంద్ర : సంగతంతా చెప్తాలెండి.

సోమ : చెప్పడానికేముంది? ఇప్పుడే ఇక్కడే మూడు ముళ్ళూ వేయించేసి ఏదో బరబళ్లాడించి పారేద్దామనుకున్నాం.

చంద్ర : కాని కామేశ్వరొప్పుకుంది కాదు.

రమ : కామేశ్వరా? ఒప్పుకుంది కాదూ? దేనికొప్పుకుంది కాదు?

సోమ : మీ వాణ్ని పెళ్ళాడ్డానికొప్పుకుంది కాదు.

రమ : పిల్లే ఒప్పుకోలేదా?

సోమ : ఊహుఁ ఒప్పుకోలేదు. "బతుకుతే బతుకుతాను. లేపోతే ఛస్తానుగాని ఆ ఫకీరు వెధవనయి పెళ్ళాణ్ణ" నేసి వెళిపోయింది.

రమ : అలా అనేసిందా!

సోమ : అంతకంటె కొంచెం మర్యాదాగానే అందనుకో. కాని అలా అన్నట్టే లెక్క. మరి మేంమాత్రం ఏం చెయ్యం? అలాంటి సున్నప్పిడతసరుకుని దాన్నెత్తిమీద బలవంతాన్న రుద్దుదామనుకున్నాం. పిల్ల మాత్రం ముందే మేలుకొని ఇంటి కెళిపోయింది.

చంద్ర : అదీ జరిగిన సంగతి.

రమ : (కొంతసేపు అలా ఊరుకొని) అంతేనండీ అంతే. మరింక మాపనింతే. ఎందుకూ పనికి రాకుండా అయిపోయేం. అక్కర్లేదని కొట్టి

పారేస్తే మరందులో తప్పేంవుంది? మంచి లేదు. మర్యాద లేదు. పన్లేదు. పాటు లేదు. పెళ్ళిక్కర్లేదు. పెడాకు లక్కర్లేదు. పిల్లలసలే అక్కర్లేదు. ఎత్తిల్లీ! ఏర్పాట్లు లేవు. బాగుపడే లక్షణాల్లేనే లేవు. మరింక మాపనింతే. మా కింక పోయేకాలవేఁగాని ఒచ్చే కాలం లేదు.

[తెర దిగిపోతూండగా శేఖరం తెర ముందుకు వస్తాడు. తెరపూర్తిగా దిగిపోతుంది]

శేఖరం : స్నేహితులారా, బాగుపడే లక్షణాల్లేని వాళ్ళకి బాగుపడే రోజులు రావనేది రమణయ్య గ్రహించుకోని చెప్పిన విషయం.

కాని ఈ జరిగిన విషయాలగురించి కొంత ఆలోచించగా నాకు మరో విషయంకూడా తోచింది. ఏవిటంటే: ఏ సమాజంలోనైనా పండితులూ, ప్రభువులూ, భాగ్యతాయుతులూ, అయినవారు, ఎప్పుడైతే పిల్లల పంటని తగ్గించి పారేమంటారో, ఎప్పుడైతే పిల్లల్ని తిరస్కరిస్తారో, అప్పుడు వారు నడిపించే ఆ సాంఘిక వ్యవస్థకి భవిష్యత్తులేదని మనం గ్రహించవలసి ఉంటుంది. ఆసమాజానికి పోయేకాలవేఁగాని ఒచ్చే కాలం లేదన్నమాట. ఇది నాకు తోచిన విషయం. తప్పో రైటో మీ రాలోచించండి. మరింక నాకు సెలవిప్పించండి.

(నిష్క్రమణ)